ONE click
ePaper
www.shanmukhavelugu.com

RNI : APTEL / 2023 / 89152

షణ్ముఖ
SHANMUKHAVELUGU
# వెలుగు
ప్రతి వార్త వెలుగు వైపు
తెలుగు దినపత్రిక

Good for Health
Best for Readers

PL.NO.IR/RNP/SV/26/2026

సంపుటి : 03 సంచిక : 213

గురువారం 13 ఆగస్టు 2026 పేజీలు 8 వెల : రూ.3

Printed by Ongole. Published From Ongle, Nellore, Guntur, Markapur, Bapatla.

## పార్లమెంట్‌లో చర్చకు సిద్ధం.. ప్రతి ప్రశ్నకూ సమాధానం చెబుతా : అమిత్ షా



(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ, ఆగస్టు 12)
పార్లమెంటు కార్యకలాపాలకు పదేపదే అడ్డంకులు ఏర్పడుతున్న నేపథ్యంలో కేంద్ర హోంమంత్రి అమిత్ షా స్పందించారు. ప్రతిష్టంభనకు తెరదించేందుకు కేంద్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. అన్ని అంశాలపై చర్చించేందుకు తాను ▶ 2లో

## షార్ట్‌కట్ కోసం వెంపర్లాడితే.. జెన్‌జీకి మోదీ సలహా



(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ, ఆగస్టు 12)
ఇంటర్నెట్‌డెస్క్: ప్రధాని నరేంద్ర మోదీ జెన్‌జీ యువతకు కీలక సూచన చేశారు. షార్ట్‌కట్ కోసం వెంపర్లాడితే నష్టపోయే ప్రమాదమే ఎక్కువని ప్రధాని హెచ్చరించారు. జీవితంలో ముందుకు సాగే క్రమంలో అర్థవంతమైన మార్గాలను ఎంచుకోవాలని హితవు పలికారు. మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ ఆత్మకథ పుస్తకం విడుదల సందర్భంగా ఆయన మాట్లాడారు. కొందరు వ్యక్తులు వేగంగా గమ్యాన్ని చేరుకునేందుకు ఫుట్‌బ్రిడ్జ్‌లను వాడకుండా రైల్వే ట్రాక్‌లను దాటుతుంటారని మోదీ గుర్తుచేశారు. ▶ 2లో

## చంద్రబాబు అధ్యక్షతన 20వ ఎస్ఐపీబీ సమావేశం...



**ఆమోదం పొందిన ప్రాజెక్టుల వివరాలు ఇవే!**
**సీఎం చంద్రబాబు అధ్యక్షతన 20వ రాష్ట్రస్థాయి పెట్టుబడుల ప్రోత్సాహక బోర్డు భేటీ**

(షణ్ముఖ వెలుగు, అమరావతి,ఆగస్టు 12)
ఆంధ్రప్రదేశ్‌లో పారిశ్రామిక ప్రగతికి ఊతమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం కీలక ముందడుగు వేసింది. ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన సచివాలయంలో జరిగిన 20వ రాష్ట్రస్థాయి పెట్టుబడుల ప్రోత్సాహక బోర్డు (ఎస్ఐపీబీ) సమావేశంలో భారీ పెట్టుబడి ప్రతిపాదనలకు ఆమోదముద్ర లభించింది. పరిశ్రమలు, ఇంధనం, ఐటీ ఎలక్ట్రానిక్స్, ఫుడ్ ప్రాసెసింగ్ వంటి కీలక ▶ 2లో

# డిసెంబరు నుంచి ఎస్క్రో ఖాతాల్లో ప్రోత్సాహకాలు




- చంద్రబాబు అధ్యక్షతన ఎస్ఐపీబీ సమావేశం
- పారిశ్రామిక రంగానికి అందిస్తున్న ప్రోత్సాహకాల చెల్లింపు విధానంలో కీలక మార్పు
- ఈ విధానం ద్వారా పారదర్శకతను పెంచడమే లక్ష్యం
- నిధుల వినియోగాన్ని సమర్థవంతంగా పర్యవేక్షించవచ్చన్న సీఎం

(షణ్ముఖ వెలుగు, అమరావతి,ఆగస్టు 12)
రాష్ట్రంలో పారిశ్రామిక రంగానికి అందిస్తున్న ప్రోత్సాహకాల చెల్లింపు విధానంలో ముఖ్యమంత్రి చంద్రబాబు కీలకమైన మార్పులకు శ్రీకారం చుట్టారు. ఈ ఏడాది డిసెంబరు నుంచి పరిశ్రమలకు ఇచ్చే అన్ని రకాల ప్రోత్సాహకాలను (ఇన్సెంటివ్స్) నేరుగా ప్రత్యేక ఎస్క్రో ఖాతాల్లో జమ చేసేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ విధానం ద్వారా పారదర్శకతను పెంచడంతో పాటు, నిధుల వినియోగాన్ని మరింత సమర్థవంతంగా పర్యవేక్షించవచ్చని ఆయన అభిప్రాయపడ్డారు. పారిశ్రామిక ప్రగతికి ప్రోత్సాహకాలు తప్పనిసరి అని, అయితే వాటిని ఎంతవరకు ఇవ్వగలమనే అంశంపై స్పష్టమైన ప్రణాళిక ఉండాలని సీఎం సూచించారు. బుధవారం (ఆగస్టు 12) నాడు సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన 20వ రాష్ట్రస్థాయి పెట్టుబడుల 2

## ఏపీలో కొత్త విమానాశ్రయాల జోరు.. మూడు జిల్లాల్లో పనుల వేగవంతం

(షణ్ముఖ వెలుగు, అమరావతి,ఆగస్టు 12)




ఏపీలో విమానయాన రంగాన్ని విస్తరించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం కీలక అడుగులు వేస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా 9 కొత్త విమానాశ్రయాలను నిర్మించాలని ప్రణాళిక రచించగా, తొలి దశలో మూడు కీలక ప్రాంతాలపై ప్రత్యేకంగా దృష్టి సారించింది. రాజధాని అమరావతి, శ్రీకాకుళం జిల్లా, సీఎం చంద్రబాబు ప్రాతినిధ్యం వహిస్తున్న కుప్పం నియోజకవర్గాల్లో విమానాశ్రయాల నిర్మాణ పనులను వేగవంతం చేసింది. ఈ మూడు ప్రాజెక్టులకు సంబంధించిన టెక్నో ఎకనమిక్ ఫీజిబులిటీ రిపోర్టులు (టీఈఎఫ్ఆర్) ఇప్పటికే సిద్ధమయ్యాయి. ఈ మూడు విమానాశ్రయాల నిర్మాణానికి మొదటి దశలో సుమారు రూ.5,545 కోట్లు ఖర్చవుతుందని ▶ 2లో

## చంద్రబాబు ఒక విజనరీ లీడర్ రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

- నిజమైన అభివృద్ధికి చంద్రబాబు చిరునామా అన్న ద్రౌపది ముర్ము
- ఏపీ అభివృద్ధికి చంద్రబాబు చేస్తున్న కృషి అభినందనీయమని ప్రశంస
- రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలోకి తీసుకెళుతున్నారన్న రాష్ట్రపతి



(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ, ఆగస్టు 12)
ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు పాలనా దక్షతపై భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రశంసలు కురిపించారు. చంద్రబాబు విజనరీ లీడర్ అని కొనియాడిన ఆమె... రాష్ట్రంలో నిజమైన అభివృద్ధికి ఆయనే అసలైన చిరునామా అని స్పష్టం చేశారు. సాంకేతికత, పాలన, మౌలిక సదుపాయాల కల్పనలో ఆయన చేపట్టిన సంస్కరణలు రాష్ట్రాన్ని ప్రగతి పథంలో ముందుకు నడిపిస్తున్నాయని పేర్కొన్నారు.
ఆంధ్రప్రదేశ్ సమగ్ర అభివృద్ధికి, ముఖ్యంగా అమరావతి నిర్మాణానికి, ఐటీ, పారిశ్రామిక రంగాల పురోగతికి చంద్రబాబు చేస్తున్న కృషి అభినందనీయమని రాష్ట్రపతి అభిప్రాయపడ్డారు. రాష్ట్ర ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా దూరదృష్టి కలిగిన నాయకత్వంతో ఏపీని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారని కొనియాడారు. ▶ 2లో

## శాసనమండలిలో ప్రభుత్వాన్ని నిలదీస్తాం: బొత్స సత్యనారాయణ

- అసెంబ్లీ సమావేశాల్లో ప్రభుత్వాన్ని నిలదీయాలని ప్రజాప్రతినిధులకు జగన్ పిలుపు
- డీఎస్సీ అవకతవకలపై ప్రభుత్వం స్పందించడం లేదన్న బొత్స
- 40 శాతం ఓట్లు వచ్చిన పార్టీకి ప్రతిపక్ష హోదా ఎందుకు ఇవ్వరని ప్రశ్న

(షణ్ముఖ వెలుగు, అమరావతి,ఆగస్టు 12)
రాబోయే అసెంబ్లీ సమావేశాల్లో ప్రజా సమస్యలపై గళమెత్తి, కూటమి ప్రభుత్వాన్ని గట్టిగా నిలదీయాలని వైసీపీ అధినేత జగన్ పార్టీ ప్రజాప్రతినిధులకు పిలుపునిచ్చారు. పార్టీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన శాసనసభా పక్ష సమావేశంలో సభ్యులకు ఆయన దిశానిర్దేశం చేశారు. అనంతరం సమావేశంలో చర్చించిన కీలక అంశాలను శాసనమండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ మీడియాకు వెల్లడించారు. డీఎస్సీ నియామకాల స్పోర్ట్స్ కోటాలో మెరిట్ అభ్యర్థులకు తీవ్ర అన్యాయం జరిగిందని, ఆధారాలున్నా ప్రభుత్వం స్పందించడం లేదని బొత్స ఆరోపించారు. దీనికి నైతిక బాధ్యత వహిస్తూ విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ వెంటనే రాజీనామా చేయాలని, ఈ అంశంపై శాసనమండలిలో ▶ 2లో





## పనుల్లో అలసత్వం వహిస్తే క్రిమినల్ కేసులు.. జైలుకే

- పుష్కర ఎత్తిపోతల పథకం పనుల్లో జాప్యంపై మంత్రి నిమ్మల ఆగ్రహం
- పనుల పురోగతిపై కీలక సమీక్ష నిర్వహించిన నిమ్మల రామానాయుడు
- పనుల్లో వైఫల్యానికి కారణమైన ఈఈకి మెమో జారీ చేయాలని ఆదేశం

2

## విద్యార్థులపై బలప్రయోగం అంశం: ఝార్ఖండ్ ప్రభుత్వాన్ని సమర్థించిన కాంగ్రెస్



**ఝార్ఖండ్ విద్యార్థుల ఆందోళనల విషయంలో రాష్ట్ర ప్రభుత్వానికి కాంగ్రెస్ మద్దతు**

(షణ్ముఖ వెలుగు, అమరావతి,ఆగస్టు 12)
ఝార్ఖండ్‌లో ఉద్యోగ నియామక పరీక్షల్లో అవకతవకలపై విద్యార్థులు చేపట్టిన ఆందోళనల నేపథ్యంలో, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర సంకీర్ణ ప్రభుత్వానికి పూర్తి మద్దతు ప్రకటించింది. ఆందోళన చేస్తున్న విద్యార్థులపై ఎటువంటి బలప్రయోగం జరగలేదని ఈ సందర్భంగా పార్టీ స్పష్టం చేసింది. ఈ అంశాన్ని పక్కదారి పట్టించేందుకు బీజేపీ ప్రయత్నిస్తోందని, 'ఎగ్జామ్ మాఫియా'ను రక్షించేందుకే ▶ 2లో

## ప్రతిపక్ష హోదా ఇవ్వకుండా గొంతు నొక్కుతున్నారు.. నాణేనికి మరో వైపు చూపిస్తా: జగన్



- ఆగస్టు 17 నుంచి ఏపీ శాసనసభ సమావేశాలు
- పార్టీ ప్రజాప్రతినిధులకు జగన్ దిశానిర్దేశం

(షణ్ముఖ వెలుగు, అమరావతి,ఆగస్టు 12)
ప్రతిపక్ష హోదా ఇవ్వకుండా తమ గొంతు నొక్కేందుకే చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం ప్రయత్నిస్తోందని వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి జగన్ ఆరోపించారు. శాసనసభను దాదాపు రెండేళ్లుగా బహిష్కరిస్తున్నప్పటికీ, శాసనమండలి వేదికగా ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలని ఆయన పార్టీ ఎమ్మెల్సీలకు దిశానిర్దేశం చేశారు. ఆగస్టు 17 నుంచి ప్రారంభం కానున్న శాసనసభ వర్షాకాల సమావేశాల నేపథ్యంలో బుధవారం నాడు ఆయన పార్టీ శాసనసభ్యులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రధాన పార్టీ అయిన వైసీపీకి ప్రతిపక్ష ▶ 2లో

## మొదటి పేజీ తరువాయి

## డిసెంబరు నుంచి ఎస్క్రో ఖాతాల్లో ప్రోత్సాహకాలు

ప్రోత్సాహక బోర్డు (ఎస్ఐపీబీ) సమావేశం జరిగింది. ఈ భేటీలో పరిశ్రమలు, ఇంధనం, ఐటీ ఎలక్ట్రానిక్స్, ఫుడ్ ప్రాసెసింగ్ రంగాలకు సంబంధించి మొత్తం 25 ప్రాజెక్టులకు బోర్డు ఆమోదం తెలిపింది. ఈ ప్రాజెక్టుల ద్వారా రాష్ట్రానికి రూ.2,08,406 కోట్ల విలువైన పెట్టుబడులు రానుండగా, తద్వారా ప్రత్యక్షంగా 21,627 మందికి ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయి.

ఇప్పటివరకు జరిగిన 20 ఎస్ఐపీబీ సమావేశాల ద్వారా మొత్తం 363 ప్రతిపాదనలకు ఆమోదం లభించిందని, తద్వారా రూ.13.78 లక్షల కోట్ల పెట్టుబడులు, 10.86 లక్షల ఉద్యోగాలు రాష్ట్రానికి రానున్నాయని అధికారులు వివరించారు.

ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, కేవలం సంప్రదాయ పరిశ్రమలే కాకుండా భవిష్యత్ అవసరాలకు తగ్గట్టు గ్రీన్ అమ్మోనియా, లిథియం బ్యాటరీలు, రోబోటిక్స్ వంటి అధునాతన రంగాలపై దృష్టి సారించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ రంగాల్లో పెట్టుబడులను ఆకర్షించేందుకు అనుసరించాల్సిన విధానాలపై అధ్యయనం చేయాలని సూచించారు. పారిశ్రామిక ప్రాజెక్టుల వల్ల కలిగే ప్రయోజనాలను ప్రజలకు వివరించి, వాటిపై కొందరు పనిగట్టుకుని చేస్తున్న దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలని అన్నారు.

ఉత్తరాంధ్రలో ఏర్పాటు చేస్తున్న డేటా సెంటర్లకు కేవలం 3.5 టీఎంసీల నీరు సరిపోతుందని, పోలవరం ఎడమ కాలువ ద్వారా గ్రావిటీపైనే విశాఖ పరిశ్రమలకు నీటిని అందిస్తామని స్పష్టం చేశారు. రాష్ట్రంలో పారిశ్రామిక ప్రగతిని అడ్డుకునేందుకు కొందరు రాజకీయ నిరుద్యోగులు సోషల్ మీడియా ద్వారా అసత్య ప్రచారాలు చేస్తున్నారని, వాటిని నమ్మవద్దని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి లక్ష్యంగా కొత్త ప్రాజెక్టులను ఆయా ప్రాంతాల్లో నెలకొల్పేలా చూడాలని అన్నారు. రాష్ట్రంలో ఏర్పాటు అవుతున్న రక్షణ రంగ ప్రాజెక్టులు జాతికే గర్వకారణమని, పుట్టపర్తి సమీపంలో డిఫెన్స్, హిందూపురం వద్ద ఏరోస్పేస్ ప్రాజెక్టులు ఏర్పాటు కావాలని ఆకాంక్షించారు.

మూలపేట పోర్టు నిర్మాణాన్ని డిసెంబరు నాటికి పూర్తి చేసి ప్రారంభించాలని ఆదేశించారు. రాయలసీమలో పండే ఉద్యాన ఉత్పత్తులను అంతర్జాతీయ మార్కెట్లకు తరలించేందుకు రోడ్, రైల్, పోర్టు కనెక్టివిటీని బలోపేతం చేయాలన్నారు. సెప్టెంబరు నాటికి 175 నియోజకవర్గాల్లో ఎంఎస్ఎంఈ పార్కులను పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకురావాలని, 'వన్ ఫ్యామిలీ-వన్ ఎంట్రప్రెన్యూర్' కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున ప్రోత్సహించాలని సీఎం అధికారులను ఆదేశించారు.

## పార్లమెంట్‌లో చర్చకు సిద్ధం.. ప్రతి ప్రశ్నకూ సమాధానం చెబుతా : అమిత్ షా

సిద్ధమని స్పష్టం చేశారు. అయితే సభలో చర్చ జరగాలా? ఆందోళన కొనసాగాలా? అనేది ప్రతిపక్షమే నిర్ణయించుకోవాలన్నారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు.

### అధికార, ప్రతిపక్షాలపోటాపోటీ

చర్చకు సిద్ధంగా ఉన్న ప్రతిపక్ష ఎంపీలు లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా కు లేఖ రాయాలని సూచించారు. అలా చేస్తే మధ్యాహ్నం 3 గంటలకు చర్చ ప్రారంభించవచ్చని.. రాత్రి వరకు చర్చ కొనసాగించేందుకు తాను సిద్ధమన్నారు. అవసరమైతే గురువారం మధ్యాహ్నం 3 గంటల వరకు కూడా చర్చను కొనసాగిద్దామని తెలిపారు. ప్రతిపక్షం అడిగే ప్రతి ప్రశ్నకూ సమాధానం ఇస్తానని షా చెప్పారు. పార్లమెంటులో "కనిపించడం లేదు", "పారిపోయారు" వంటి పదాలు ఉపయోగించడంపై ఆయన అభ్యంతరం వ్యక్తం చేశారు. ఢిల్లీలో విద్యార్థులపై లాఠీఛార్జి ఘటనపై చర్చకు రావాలని ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీని ఉద్దేశించి సవాల్ చేశారు.

## ఏపీలో కొత్త విమానాశ్రయాల జోరు.. మూడు జిల్లాల్లో పనుల వేగవంతం

ప్రభుత్వం అంచనా వేసింది. అవసరమైన నిధుల కోసం హడ్కో (హౌసింగ్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్) నుంచి రుణం తీసుకునేందుకు ఒప్పందాలు కూడా చేసుకుంది. రాష్ట్ర విమానాశ్రయాల అభివృద్ధి సంస్థ (ఏపీఏడీసీఎల్) సైట్ క్లియరెన్స్‌ల కోసం కేంద్ర పౌర విమానయాన మంత్రిత్వ శాఖకు ప్రతిపాదనలు పంపింది. కేంద్రం నుంచి గ్రీన్ సిగ్నల్ రాగానే, డిటైల్డ్ ప్రాజెక్ట్ రిపోర్టుల (డీపీఆర్) తయారీకి సంస్థలను ఎంపిక చేయనుంది.

### అంతర్జాతీయ ప్రమాణాలతో అమరావతి ఎయిర్‌పోర్ట్

రాజధాని అమరావతిలో అంతర్జాతీయ ప్రమాణాలతో గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయాన్ని నిర్మించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. దీనికోసం 4,618 ఎకరాలను భూ సమీకరణ విధానంలో సేకరించాలని భావిస్తోంది. పబ్లిక్-ప్రైవేట్ పార్టనర్‌షిప్ (పీపీపీ) విధానంలో చేపట్టే ఈ ప్రాజెక్టు మొదటి దశ నిర్మాణానికి రూ.4,419 కోట్లు, రోడ్లు, డ్రైనేజీ వంటి మౌలిక సదుపాయాలకు మరో రూ.1,087 కోట్లు అవసరమని అంచనా వేశారు. ఈ మేరకు కేంద్రానికి ప్రతిపాదనలు పంపించారు.

### శ్రీకాకుళం, కుప్పంలోనూ పనులు ముమ్మరం

శ్రీకాకుళం జిల్లాలో ఎయిర్‌పోర్ట్ కోసం 1,185 ఎకరాలను గుర్తించి, భూసేకరణకు ఉత్తర్వులు సిద్ధం చేశారు. ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఏఏఐ) భాగస్వామ్యంతో తొలి దశను రూ.392 కోట్లతో అభివృద్ధి చేయనున్నారు. ఇందుకు అవసరమైన రూ.237.55 కోట్ల రుణాన్ని హడ్కో నుంచి తీసుకోనున్నారు. మరోవైపు, కుప్పం విమానాశ్రయానికి అవసరమైన 1,788 ఎకరాల్లో ఇప్పటికే 1,300 ఎకరాలను సేకరించారు. తొలి దశను రూ.734 కోట్లతో చేపట్టాలని నిర్ణయించారు. దీనికి సంబంధించి హడ్కో నుంచి రూ.313.25 కోట్ల రుణ ఒప్పందం కుదిరింది. ఇప్పటికే రూ.100 కోట్లతో రోడ్ల నిర్మాణ పనులకు అనుమతులు కూడా ఇచ్చారు. ఈ మూడు జిల్లాల్లో భూసేకరణ, ఇతర ప్రక్రియలు వేగంగా ముందుకు సాగుతున్నాయి.

## చంద్రబాబు అధ్యక్షతన 20వ ఎస్ఐపీబీ సమావేశం...

రంగాల్లో మొత్తం 25 ప్రాజెక్టులకు సంబంధించి రూ.2,08,406 కోట్ల విలువైన పెట్టుబడులకు బోర్డు ఏకగ్రీవంగా గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ ప్రాజెక్టుల ద్వారా రాష్ట్రంలో ప్రత్యక్షంగా 21,627 మందికి ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయి.

## చంద్రబాబు ఒక విజనరీ లీడర్ రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

రాష్ట్రపతి నుంచి వచ్చిన ఈ ప్రశంసలపై టీడీపీ శ్రేణులు, కూటమి నాయకులు తీవ్ర హర్షం వ్యక్తం చేస్తున్నారు.రాష్ట్రపతి భవన్‌లో రాష్ట్రపతి ద్రౌపది ముర్మును విజయనగరం టీడీపీ ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు తన కుటుంబంతో కలిసి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రాష్ట్రపతికి 'అమరావతి' కాఫీ టేబుల్ బుక్‌ను బహుకరించారు. ఆ పుస్తకంలోని రాజధాని అమరావతి విశేషాలు, ఫొటోలను రాష్ట్రపతి ఎంతో ఆసక్తిగా తిలకించారు. ఈ క్రమంలోనే ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు దూరదృష్టిని కొనియాడుతూ, ఆయన నిజమైన అభివృద్ధికి చిరునామా అని, ఒక విజనరీ లీడర్ అని రాష్ట్రపతి ప్రశంసల వర్షం కురిపించారు.అంతేకాకుండా, ఎంపీ అప్పలనాయుడి నిబద్ధతను రాష్ట్రపతి ప్రత్యేకంగా అభినందించారు. పార్లమెంట్ సమావేశాలకు ప్రతిరోజూ సైకిల్‌పై రావడం, 100 శాతం హాజరు నమోదు చేసుకోవడంపై సంతోషం వ్యక్తం చేశారు. సంస్కారం, నిరాడంబరత కలిగిన అప్పలనాయుడిని చూస్తుంటే "నన్ను నేను చూసుకున్నట్లే ఉంది" అని అన్నారు.

## శాసనమండలిలో ప్రభుత్వాన్ని నిలదీస్తాం: బొత్స సత్యనారాయణ

పోరాడతామని స్పష్టం చేశారు.రాష్ట్రంలో అభివృద్ధి అంతా సీఎం చంద్రబాబు కుటుంబానికి, టీడీపీ నేతలకే పరిమితమైందని విమర్శించారు. ఉద్యోగుల సమస్యలు, ప్రజా సమస్యలన్నింటినీ అసెంబ్లీ వేదికగా లేవనెత్తుతామన్నారు. 40 శాతం ఓటు షేర్ సాధించిన వైసీపీకి ప్రధాన ప్రతిపక్ష హోదా ఇవ్వకపోవడం ప్రజా తీర్పును అవమానించడమేనని మండిపడ్డారు. చట్టసభల్లో నిబంధనల ప్రకారమే నడుచుకుంటామని, ప్రభుత్వాన్ని ప్రతి అంశంలో ఆధారాలతో సహా ఎండగడతామని హెచ్చరించారు.

## పనుల్లో అలసత్వం వహిస్తే క్రిమినల్ కేసులు.. జైలుకే

(షణ్ముఖ వెలుగు, అమరావతి,ఆగస్టు 12)

పుష్కర ఎత్తిపోతల పథకం పైప్‌లైన్ పనుల్లో జాప్యం, నిర్లక్ష్యం వహించడంపై ఆంధ్రప్రదేశ్ నీటిపారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులతో పాటు కాంట్రాక్టు ఏజెన్సీ ప్రతినిధులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో పనుల పురోగతిపై ఆయన సమీక్ష చేపట్టారు. ముఖ్యమంత్రి చంద్రబాబుకు సమర్పించిన వర్క్ షెడ్యూల్ ప్రకారం పనులు వేగంగా జరగకపోవడంపై మంత్రి అసంతృప్తి వ్యక్తం చేస్తూ తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు.

ప్రజాధనానికి నష్టం కలిగిస్తూ, ఇచ్చిన గడువులోగా పనులు పూర్తి చేయకుండా అలసత్వం వహిస్తే కాంట్రాక్టర్లపై క్రిమినల్ కేసులు నమోదు చేసి జైలుకు పంపడానికి కూడా వెనుకాడబోమని కలెక్టర్, ఎస్పీలను మంత్రి ఆదేశించారు. పనుల నిర్వహణలో వైఫల్యానికి బాధ్యుడైన సంబంధిత ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కి మెమో జారీ చేయాలని ఈఎన్సీని ఆదేశించారు. ఎల్‌నినో వంటి వాతావరణ పరిస్థితుల్లో ప్రతి నీటి బొట్టును జాగ్రత్తగా కాపాడుకోవాలని ముఖ్యమంత్రి సూచించారని గుర్తుచేసిన మంత్రి, ఈ నెలాఖరులోపు సీఎం పనులను స్వయంగా సమీక్షించే అవకాశం ఉన్నందున అధికారులు ప్రతిరోజూ 'వర్క్ ప్రోగ్రెస్ రిపోర్ట్' అందించాలని హెచ్చరికలు జారీ చేశారు.

## విద్యార్థులపై బలప్రయోగం అంశం: ఝార్ఖండ్ ప్రభుత్వాన్ని సమర్థించిన కాంగ్రెస్

ఇదంతా చేస్తోందని కాంగ్రెస్ ఆరోపించింది.

బుధవారం నాడు కాంగ్రెస్ మంత్రులు విలేకరులతో మాట్లాడుతూ, నిరసనలు తీవ్రరూపం దాల్చకముందే పేపర్ లీకేజీలను అరికట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం తగిన చర్యలు తీసుకుందని వెల్లడించారు. రాష్ట్ర సీఐడీ విచారణకు బదులుగా సీబీఐ దర్యాప్తును బీజేపీ డిమాండ్ చేయడం వెనుక ఎగ్జామ్ మాఫియాను రక్షించాలనే దురుద్దేశం ఉందని వారు మండిపడ్డారు. గతంలో అధికారంలో ఉన్నప్పుడు బీజేపీ ప్రభుత్వం యువత గొంతు నొక్కిందని వారు విమర్శించారు.

2015 నుంచి దేశవ్యాప్తంగా బీజేపీ పాలనలో 152 పేపర్ లీకేజీలు జరిగితే, సీబీఐ కేవలం 17 కేసులనే మాత్రమే విచారించిందని, వాటిలో ఒక్క కేసులోనూ శిక్షలు పడలేదని కాంగ్రెస్ గణాంకాలను ఉదహరించింది. కేంద్రం ఒత్తిడితోనే ఝార్ఖండ్ బీజేపీ నేతలు వ్యవహరిస్తున్నారని, ఆగస్టు 10న శాంతియుతంగా సాగుతున్న నిరసనలను పక్కదారి పట్టించేందుకు బయటి వ్యక్తులను రంగంలోకి దించారని ఆరోపించింది.మరోవైపు, జేఎస్ఎస్‌సీ-సీజీఎల్ పరీక్షను రద్దు చేయాలని, జేపీఎస్‌సీ, జేఎస్ఎస్‌సీ నియామకాల్లోని అవకతవకలపై సీబీఐ విచారణ జరిపించాలని కోరుతూ విద్యార్థులు నిరసనలు కొనసాగిస్తున్నారు. అసెంబ్లీ ముట్టడికి యత్నించిన విద్యార్థులపై పోలీసులు వాటర్ కేనన్లు ప్రయోగించడంతో పాటు బలప్రయోగం చేయడంతో ఉద్రిక్తత నెలకొంది. తాము విద్యార్థులతో సంప్రదింపులు జరుపుతున్నామని, వారి డిమాండ్లలో చాలావరకు అంగీకరించామని ప్రభుత్వం పేర్కొంటుండగా, విద్యార్థులు మాత్రం ఈ వాదనను తోసిపుచ్చుతూ తమ పోరాటాన్ని సాగిస్తున్నారు.

## షార్ట్‌కట్ కోసం వెంపర్లాడితే.. జెన్‌జీకి మోదీ సలహా

అలాంటి వారికోసమే రైల్వే స్టేషన్లలో బోర్డులపై ప్రదర్శించే హెచ్చరికలు జీవిత పాఠాలను నేర్పుతాయన్నారు. "మన ఆలోచనలపై ప్రభావం చూపించే ఇన్‌ఫ్లుయెన్సర్లు, రీల్స్ పట్ల జాగ్రత్తగా ఉండాలి. మీరు ముందుకు వెళ్లే మార్గం కావాలనుకుంటే.. మీరు ఆరాధించే వ్యక్తుల ఆత్మకథ చదవండి" అని సూచించారు. ఇటీవల కాలంలో మోదీ జెన్‌జీ యువతతో కనెక్ట్ అయ్యేలా తన సోషల్ మీడియా యాక్టివిటీలో మార్పులు చేసుకుంటున్నారు. ఇన్‌స్టాగ్రామ్‌లో సెల్ఫీ వీడియోలను పోస్టు చేస్తున్నారు. యువత వాడే భాషను ఉపయోగిస్తున్నారు. అదే సమయంలో రీల్స్‌కే పరిమితం కాకుండా కెరీర్‌పైనా దృష్టిపెట్టాలని సూచించారు. ఇదిలా ఉంటే.. 'తీఅబఎజూష్ట్ర శీట ్ష్ట్రవ ×అఎఱఖఅ =వజూబఎశ్రీఱష: వీఎ ాఱటవ, వీఎ  ౌతీబష్ట్రశ్రీవం' పేరిట కోవింద్ రాసిన పుస్తకావిష్కరణ కార్యక్రమం ఢిల్లీలో జరిగింది.

## ప్రతిపక్ష హోదా ఇవ్వకుండా గొంతు నొక్కుతున్నారు.. నాణేనికి మరో వైపు చూపిస్తా: జగన్

నేత హోదా ఇచ్చేందుకు ప్రభుత్వం ఇష్టపడటం లేదని, అందుకే ప్రజా సమస్యలను మీడియా ద్వారానే ప్రజల దృష్టికి తీసుకెళ్లి నాణేనికి మరోవైపు చూపిస్తానని స్పష్టం చేశారు.శాసనమండలిలో వైసీపీకి ఉన్న బలాన్ని ఉపయోగించుకుని ప్రజావాణిని బలంగా వినిపించాలని జగన్ సూచించారు. "గత 74 రోజులుగా డీఎస్సీ కుంభకోణంపై 10 రకాల నిరసనలు చేపట్టాం. పేపర్ లీకేజీ, ఔట్‌సోర్సింగ్ కుంభకోణాలు, స్పోర్ట్స్ కోటాలో అక్రమాలు, ప్రభుత్వ ఉత్తర్వుల మార్పు వంటి అంశాలను ఆధారాలతో సహా బయటపెట్టాం. విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ప్రమేయంపై సీబీఐ విచారణ జరపాలని డిమాండ్ చేశాం" అని జగన్ వివరించారు.ఫీజు రీయింబర్స్‌మెంట్, వసతి దీవెన పథకాలకు సంబంధించి 13 త్రైమాసికాల బకాయిలు పేరుకుపోయాయని, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని జగన్ అన్నారు. సుమారు రూ. 9,100 కోట్లు, రూ. 3,300 కోట్ల బకాయిలు ఉండగా, ప్రభుత్వం కేవలం రూ. 2,900 కోట్లు విడుదల చేసిందని విమర్శించారు. ఈ అంశాన్ని మండలిలో లేవనెత్తి చర్చకు పట్టుబట్టాలని ఎమ్మెల్సీలకు సూచించారు.రైతులకు గిట్టుబాటు ధర లభించడం లేదని, పంటలకు నీరందడం లేదని, ఉచిత పంటల బీమా నిలిపివేయడంతో అన్నదాతలు తీవ్ర సంక్షోభంలో ఉన్నారని జగన్ ఆవేదన వ్యక్తం చేశారు. పీపీపీ ప్రాజెక్టుల పేరుతో ప్రైవేటు సంస్థలకు రాయితీలు కల్పిస్తూ ప్రజలపై భారం మోపుతున్నారని, ప్రభుత్వ సేవల ప్రైవేటీకరణను గట్టిగా ప్రశ్నించాలని పిలుపునిచ్చారు.దిశ చట్టం రద్దు, ప్రభుత్వ విధానాలను ప్రశ్నించిన బీసీ నేతలు చింతడ రవి, ముస్తఫాలపై అక్రమ కేసులు బనాయించడం వంటి అంశాలను సభలో ప్రస్తావించాలని ఆయన ఆదేశించారు. జూనియర్ డాక్టర్ల సమ్మె, ఉద్యోగులు, మహిళలు, యువతలో ఉన్న అసంతృప్తిని కూడా మండలిలో ఎత్తిచూపాలని, పూర్తి ఆధారాలతో సభకు వెళ్లి ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలని జగన్ పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు.

## మార్టూరు మండల టీడీపీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా శివరాత్రి శ్రీనివాసరావు, వెంకట్రావు

### నూతన కమిటీని ప్రకటించిన ఎమ్మెల్యే ఏలూరి





(షణ్ముఖ వెలుగు, మార్టూరు, ఆగస్టు 12)

తెలుగుదేశం పార్టీ మార్టూరు మండల నూతన కమిటీ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులుగా శివరాత్రి శ్రీనివాసరావు, గొట్టిపాటి వెంకట్రావు నియమితులయ్యారు. ఈ మేరకు తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కమిటీ ఆదేశాల మేరకు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు నూతన కమిటీని ప్రకటించారు. పార్టీని గ్రామస్థాయిలో మరింత బలోపేతం చేయడంతోపాటు, ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లేలా నూతన కమిటీ పనిచేయాలని ఎమ్మెల్యే ఏలూరి సూచించారు. సమష్టిగా పనిచేస్తూ మార్టూరు మండలంలో తెలుగుదేశం పార్టీకి మరింత బలమైన పునాది వేయాలని ఎమ్మెల్యే ఏలూరి ఆకాంక్షించారు.నూతన కమిటీ సభ్యులకు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు అభినందనలు తెలిపారు.

నూతన కమిటీ వివరాలు ఇలా ఉన్నాయి....

అధ్యక్షుడు శివరాత్రి శ్రీనివాసరావు, జొన్నతాళి, ప్రధాన కార్యదర్శి గొట్టిపాటి వెంకట్రావు, మార్టూరు, ఉపాధ్యక్షుడు జొన్నలగడ్డ యేసుపాదం, కోనంకి, ఆర్గనైజింగ్ కార్యదర్శి పాలేపు జానకి రామయ్య, ద్రోణాదుల, ఆర్గనైజింగ్ కార్యదర్శి తన్నీరు శ్రీనివాసరావు, వలపర్ల, ఆర్గనైజింగ్ కార్యదర్శి షేక్ కరీముల్లా, మార్టూరు, కార్యదర్శి పోలా చిట్టిబాబు, డేగరమూడి, కార్యదర్శులు చెన్నుపాటి అంజనేయులు, తాటివారిపాలెం, తన్నీరు రామాంజనేయులు, రాజుపాలెం, కోశాధికారి తల్లూరి రమేష్, లక్కవరం లు ఎంపికయ్యారు.

## మండల టిడిపి విస్తృతస్థాయి సమావేశం





(షణ్ముఖ వెలుగు, పొన్నలూరు, ఆగస్టు 12)


మండల టిడిపి కార్యాలయ సమీపంలో బుధవారం టిడిపి అధ్యక్షుడు అనుమోలు సాంబశివరావు ఆధ్వర్యంలో విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కొండపి నియోజకవర్గం పరిశీలకురాలు డాక్టర్ పి చందన స్రవంతి మాట్లాడుతూ ఇంటింటికి టిడిపి కార్యక్రమంలో భాగంగా ప్రతి ఒక్కరు వారి సమస్యలు తెలుసుకొని వారి సమస్యలు పరిష్కరించాలని తెలిపారు. ఓటరు సంబంధించి నోటీసులు వచ్చిన వారిని సమస్య ఏమిటో తెలుసుకొని మళ్లీ డీటెయిల్స్ పంపించాలని సూచించారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు తెలియజేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి నాయకులు కర్ణ కోటిరెడ్డి, మండవ ప్రసాద్, గుమ్మల్ల వెంకట్రావు, పిల్లి వెంకట నారాయణ రెడ్డి, మండవ మురళి మోహన్, మన్నెం రమణయ్య, ఘట్టమనేని సుబ్బారావు,అనుమోలు రాజా రమేష్, ఉన్నం శ్రీనివాసరావు, జి రమణారెడ్డి, డి మధుబాబు, దాసరి కృష్ణారావు, మన్నెం మల్లికార్జునరావు, పోతు రమేష్ బాబు, చల్లా శ్రీనివాసరావు, టీ చిన్నప నాయుడు, ఎర్ర నరేంద్ర, పి రమణయ్య, మాదాల ప్రసాదు, పల్లపోతు వెంకట్రావు, తదితరులు పాల్గొన్నారు.

## పార్టీ బలోపేతం, ప్రజా సమస్యల లక్ష్యంగా మండల బిజెపి కార్యవర్గ విస్తృత సమావేశం



(షణ్ముఖ వెలుగు, చిన్నగంజాం, ఆగస్టు 12)

పార్టీ బలోపేతం, ప్రజా సమస్యలే లక్ష్యంగా ఆంధ్రప్రదేశ్ భారతీయ జనతా పార్టీ మండల ఇంచార్జి అడపాల లక్ష్మీ రాజ్యం అధ్యక్షతన, మండల అధ్యక్షుడు రాజేష్ కుమార్ ఆధ్వర్యంలో బుధవారం మండల భాజాపా కార్యాలయంలో మండల కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో మండల ఇంచార్జి అడపాల లక్ష్మీ రాజ్యం పార్టీ నాయకులకు, కార్యవర్గంలోని సభ్యులకు పార్టీ విధివిధానాలను, భవిష్యత్ లో జరపవలసిన కార్యక్రమాలను గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అడపా కృష్ణ, జిల్లా ఉపాధ్యక్షులు ఉలిచి ఏసుబాబు, బిఎల్ఏ శిఖరం కోటయ్య, హర్ ఘర్ తిరంగ్ జిల్లా కో కన్వీనర్ మెట్టు వెంకట సుబ్బారావు, జిల్లా కార్యవర్గ సభ్యులు అనుమాలశెట్టి శ్రీనివాసరావు, ఎస్సీ సెల్ నాయకులు కోలాసుబ్బారావు ,అమరా మోహన్‌రావు, ఎస్సీ సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.


ప్రకాశం


మార్కాపురం


బాపట్ల

షణ్ముఖ
# వెలుగు
ప్రతి వార్త వెలుగు వైపు
తెలుగు దినపత్రిక
13.08.26 గురువారం





## వెలిగొండ ప్రాజెక్టు ముంపు గ్రామాల
# ప్రజల తరలింపు పకడ్బందీగా చేపట్టాలి

### జిల్లా కలెక్టర్ ఎం విజయ సునీత

### ఆగస్టు 22న నీటి విడుదల ట్రయల్ రన్ నేపథ్యంలో మార్కాపురం కలెక్టరేట్‌లో సమీక్షా సమావేశం

### సహృద్భావ వాతావరణంలో, ఒత్తిడి లేకుండా సున్నితంగా తరలింపు ప్రక్రియ నిర్వహించాలని ఆదేశం

### పునరావాస కాలనీల్లో మౌలిక వసతులు యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని స్పష్టం

**(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, మార్కాపురం, ఆగస్టు 12)**

వెలిగొండ ప్రాజెక్టు ముంపు గ్రామాల ప్రజల తరలింపు ప్రక్రియను ఎలాంటి సమస్యలు తలెత్తకుండా, అన్ని రకాల ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటూ అత్యంత పకడ్బందీగా చేపట్టాలని ప్రకాశం జిల్లా కలెక్టర్ ఎం విజయ సునీత అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం ఈనెల 22వ తేదీన వెలిగొండ ప్రాజెక్టు నుంచి నీటి విడుదల ట్రయల్ రన్ నిర్వహించనున్న నేపథ్యంలో, ముంపు గ్రామాల ప్రజల పునరావాసం, మౌలిక వసతులు, ఇతర సమస్యలపై బుధవారం మార్కాపురం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా స్థాయి అధికారులతో కలెక్టర్ ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. పరిహారం అందిన నిర్వాసితులతో అధికారులు సామరస్యంగా చర్చించి, ఎటువంటి ఒత్తిడికి గురిచేయకుండా సున్నితంగా వారిని పునరావాస కేంద్రాలకు తరలించాలని సూచించారు. పరిహారం విషయంలో అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ ఖచ్చితంగా న్యాయం చేస్తామని ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

**ప్రత్యేక కమిటీల ద్వారా ప్రణాళికాబద్ధంగా తరలింపు**

ముంపు ప్రాంతాలైన సుంకేసుల, కలనూతల, గుండెచర్ల, గొట్టిపడియ, చింతల ముడిపి, కాటమరాజు తండా, లక్ష్మీపురం, కృష్ణానగర్, అక్కచెరువు గ్రామాల ప్రజలను సురక్షితంగా తరలించేందుకు ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేశామని, సమగ్ర ప్రణాళికతో ముందుకు వెళ్తున్నామని కలెక్టర్ వివరించారు.

**పునరావాస కాలనీల్లో ప్రగతి నివేదికలు**

పునరావాస కాలనీలలో చేపడుతున్న అభివృద్ధి పనుల పురోగతిపై అధికారులు రోజువారీగా 'ప్రోగ్రెస్ రిపోర్ట్' అందజేయాలని ఆదేశించారు. కాలనీల్లో త్రాగునీరు, విద్యుత్, రోడ్లు తదితర మౌలిక సదుపాయాలను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని అధికారులకు తేల్చి చెప్పారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ పి. శ్రీనివాసులు, ఆర్డీఓ వెంకట శివరామిరెడ్డి, ఆర్.డబ్ల్యూ.ఎస్. ఈఈ సురేష్ బాబు, జిల్లా రవాణా శాఖ అధికారి రాంబాబు, జిల్లా మైనింగ్ అధికారి రవి ప్రసాద్, డ్వామా పీడీ సువార్త, ఇన్చార్జ్ జిల్లా వ్యవసాయ అధికారి బాలాజీ నాయక్, డిఇఓ సుబ్బారావు, వివిధ మండలాల తహసీల్దార్లు, ఇతర ప్రభుత్వ శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

# వైద్యులకు సెలవులు రద్దు

### సెలవుల్లో ఉన్న వారిని వెనక్కి పిలిపించాం

### డిప్యూటేషన్ మీద 40 మంది వైద్యులు కేటాయింపు

### నర్సింగ్ స్టూడెంట్స్ సేవలు వినియోగం

### జూనియర్ డాక్టర్ల సమ్మె నేపథ్యంలో చర్యలు

### జిజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్ మాణిక్యరావు



**(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, ఒంగోలు, ఆగస్టు 12)**

జూనియర్ డాక్టర్ల సమ్మె నేపత్యంలో పేషంట్లకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా అన్ని రకాల చర్యలు తీసుకున్నట్టు జిజిహెచ్ సూపరెంటెండెంట్ డాక్టర్ ఎస్ మాణిక్యరావు తెలిపారు. వైద్యులకు సెలవులు రద్దు చెయ్యడమే కాకుండా, సెలవులో ఉన్న వారిని వెనక్కి పిలిపించడం జరిగిందని జిజిహెచ్ సూపరెంటెండెంట్ డాక్టర్ ఎస్ మాణిక్యరావు తెలిపారు. డీఎంహెచ్‌వో, డీసీహెచ్ ప్రభుత్వ వైద్య కళాశాల నుంచి దాదాపు 40 మంది స్పెషలిస్ట్ మరియు వైద్యులను డిప్యూటేషన్ మీద కేటాయించడం జరిగింది అని వీరి సేవలను అత్యవసర విభాగాల్లో వినియోగించుకుంటామన్నారు. సీనియర్ రెసిడెంట్స్, విదేశాల్లో చదివి హౌస్ సర్జన్ చేస్తున్న వారికి ఆంధ్రప్రదేశ్ వైద్య శాఖ నిబంధనల ప్రకారం సమ్మెలో పాల్గొనే వెసులుబాటు ఉండదు. కావున వీరి సేవలు పూర్తి స్థాయిలో వినియోగించుకుంటున్నామని తెలిపారు. ప్రైవేట్ నర్సింగ్ స్కూల్స్ నుంచి దాదాపు 200 నర్సింగ్ సూట్డెంట్స్‌ను సేవలు వినియోగించుకునేందుకు యాజమాన్యాలు అంగీకరించాయని తెలిపారు. అత్యవసర, ఇన్ పేషెంట్, అవుట్ పేషెంట్ సేవలు ఎటువంటి అంతరాయం లేదన్నారు. ఆసుపత్రిలో వైద్య సేవలు ఎప్పటిలాగే కొనసాగుతున్నాయని తెలిపారు. సమ్మె ప్రారంభం రోజున 11న ఆసుపత్రిలో 1840 మంది సేవలు పొందారన్నారు.

# నెలాఖరులో వెలుగొండ ప్రాజెక్టు ద్వారా నల్లమల సాగర్‌కి కృష్ణా జలాలు

### వెలుగొండ ప్రారంభోత్సవ ఏర్పాట్ల పై మంత్రుల సమీక్ష

**(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, మార్కాపురం, ఆగస్టు 12)**

ఈ నెలాఖరులో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వెలుగొండ ప్రాజెక్టు ప్రారంభించనున్న నేపథ్యంలో ఆ ఏర్పాట్ల పై మంత్రులు డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి, ఆనం రామనారాయణరెడ్డి, నిమ్మల రామానాయుడు, గొట్టిపాటి రవికుమార్ లు మార్కాపురం జిల్లా కలెక్టర్, ఆ ప్రాంత ఎమ్మెల్యేలు, టీడీపీ ఇంచార్జ్‌లతో బుధవారం జూమ్ వేదికగా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ ఉమ్మడి ప్రకాశం జిల్లా పశ్చిమ ప్రాంత ప్రజల 30 ఏళ్ల కలను సీఎం చంద్రబాబు నిజం చేశారన్నారు. ఈ నెలాఖరులో వెలుగొండ ప్రాజెక్టును ముఖ్యమంత్రి ప్రారంభించనున్న నేపథ్యంలో పటిష్ట ఏర్పాట్లు చేయాలని సూచించారు. కూటమి ప్రభుత్వం ప్రాజెక్ట్ పనులతోపాటు నిర్వాసితుల సమస్యలను కూడా పరిష్కరిస్తున్నదని చెప్పారు. అందులో భాగంగా తొలి విడత రూ.318 కోట్లు వారి ఖాతాల్లో జమ చేశామని చెప్పారు. ఇక మిగిలిన 4,761 కుటుంబాలకు ఇవ్వాల్సిన రూ.600 కోట్లలో త్వరలోనే రూ.300 కోట్లు జమ చేస్తామన్నారు. చివరి విడత రూ.300 కోట్లు త్వరలో చెల్లించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. వెలుగొండ నిర్వాసిత గ్రామాల్లో నిర్వాసితులను త్వరితగతిన ఖాళీ చేసే విధంగా చర్యలు తీసుకోవాలని మంత్రులు సూచించారు.

# విద్యుత్ అధికారుల తనిఖీలు రూ.13 లక్షల పైగా జరిమానా విదింపు



**(షణ్ముఖ వెలుగు, చిన్నగంజాం, ఆగస్టు 12)**

మండలంలో బుధవారం బాపట్ల సూరింటెండింగ్ ఇంజినీర్ జి ఆంజనేయులు, ఎం భాస్కరరావు, చీరాల ఈఈ కె జాన్ థామస్ ఆధ్వర్యంలో విద్యుత్ సరఫరాలో అక్రమాలు, విద్యుత్ చౌర్యం (కరెంట్ తీయడం), మీటర్లలో లోపాలను అరికట్టడానికి విద్యుత్ శాఖాధికారులతో కూడిన 41 విజిలెన్స్ బృందాలు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. నిబంధనలు ఉల్లంఘించిన 215 మంది పై కేసులు నమోదు చేసి రూ.13,08,800లు అపరాధ రుసుమును వింధించారు. ఈ కార్యక్రమంలో వేటపాలెం డిప్యూటీ ఈఈ పెరుగు శ్రీనివాస్, చీరాల డిప్యూటీ ఈఈ పి హరిప్రసాదరావు, పర్చూరు డిప్యూటీ ఈఈ జే శ్రీనివాసరావు, చిన్నగంజాం ఏఈ ఎల్ బ్రహం, చీరాల డివిజన్ ఏఈలు, సిబ్బంది పాల్గొన్నారు.

# గిద్దలూరు పీజీఆర్ఎస్ కార్యక్రమం వాయిదా



**(షణ్ముఖ వెలుగు, గిద్దలూరు, ఆగస్టు 12)**

ఈ నెల 14వ తేదీన గిద్దలూరులో నిర్వహించదలచిన ఒక నెల-ఒక నియోజకవర్గం-నాలుగు పర్యటనలు కార్యక్రమాన్ని వాయిదా వేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ఎం విజయ సునీత తెలిపారు. స్వాతంత్ర దినోత్సవ ఏర్పాట్లు, తదితర పరిస్థితుల దృష్ట్యా ఈ కార్యక్రమాన్ని వాయిదా వేస్తున్నట్లు ఆమె తెలియజేశారు. కార్యక్రమానికి సంబంధించి తేదీని తర్వాత ప్రకటిస్తామని కలెక్టర్ పేర్కొన్నారు.

# వెలుగొండ నిర్వాసితులను బలవంతంగా గ్రామాల నుండి ఖాళీ చేయిస్తారా.. ఇదెక్కడి న్యాయం..

## సీనియర్ సిటిజన్స్ ఫోరం అధ్యక్షులు పివి శేషయ్య

(షణ్ముఖ వెలుగు, కనిగిరి టౌన్, ఆగస్టు 12)

పూల సుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టు పూర్తి చేసి ఆగస్టు 21న నీటి విడుదలకు ట్రయల్ రన్ నిర్వహిస్తున్నట్లుగా వస్తున్న వార్తలు కొందరికి సంతోషాన్ని, మరి కొందరికి ఖేదంను మిగిల్చపోతుందా. భవిష్యత్ తరాల కోసం త్యాగాలు చేసిన నిర్వాసితులకు 2013 భూ సేకరణ చట్టం ప్రకారం పూర్తి పరిహారం చెల్లించకుండా మరియు ఆర్ ఆర్ ప్యాకేజీని అమలు చేయకుండా, ఇళ్ల స్థలాలు కేటాయించి ఇండ్ల నిర్మాణం పూర్తి చేయకుండా, బలవంతంగా గ్రామాల నుండి ఖాళీ చేయించడం ఏమిటి . నిర్వాసితులను ఏమైనా జల సమాధి చేస్తారా. ఈ ప్రశ్నలను పాలకులకు సభ్య సమాజం సంధిస్తున్నది. 1996లో ప్రాజెక్టు శంకుస్థాపన జరిగింది. 2004 లో పనులు ప్రారంభించారు. గడిచిన 30 ఏళ్ల తర్వాత ప్రాజెక్టును పూర్తి చేసి ఈ సంవత్సరం జూన్ చివరి నాటికి సాగర్ జలాలతో ప్రాజెక్టును ప్రభుత్వం నింపుతామని వాగ్దానం చేసింది. ప్రాజెక్టు పరిధిలోనీ నిర్వాసిత గ్రామాలు 11 కాగా, ప్రభుత్వం గుర్తించిన నిర్వాసితుల సంఖ్య 7200. వీరికి అదనంగా 18 సంవత్సరాలు నిండిన 1500 మందిని ప్రభుత్వం పరిహారానికి అర్హులుగా గుర్తించ వలసి ఉంది. అనగా మొత్తం బాధితులు 8700 మంది. కానీ నిర్వాసితులకు పరిహారం కోసం 300 కోట్లు కేటాయించారు. ఇప్పటికీ పరిహారం అందినది కేవలం 2300 మందికి మాత్రమే. తక్షణం 600 కోట్ల రూపాయలు బాధితులకు పరిహారంగా చెల్లించవలసి ఉంది. ప్రభుత్వం వాగ్దానం ప్రకారం ఆగస్టు 11 నాటికి అర్హులందరికీ పరిహారం చెల్లిస్తామన్నారు. ఈ నెల 21న రెండు



టన్నెల్స్ నుండి నీటి విడుదలకు సంబంధించిన ట్రయిల్ రన్ నిర్వహిస్తామన్నారు. విచిత్రం ఏమిటంటే ఇప్పటికీ నిర్వాసి గ్రామాలైన గుండం చర్ల , గొట్టిపడియ నిర్వాసితులకు అసలు ఇండ్ల స్థలాలు కేటాయించ లేదు. ఇళ్ల స్థలాలు ఇవ్వకుండా ఇండ్ల నిర్మాణం చేయకుండా నిర్వాసితులు ఎక్కడికి వెళ్లి తలదాచుకోవాలి. అదేమంటే 21 నాటికి ఖాళీ చేయాల్సిందే లేదా తాత్కాలికంగా గుడారాలు వేసుకుని ఉన్నఫలంగా గ్రామాలు ఖాళీ చేయాల్సిందే అంటూ జిల్లా ఉన్నత స్థాయి అధికారులు హుకుం జారీ చేస్తున్నారు. చట్టాన్ని అమలు చేయవలసిన అధికారులే 2013 భూసేకరణ చట్టాలను ఉల్లంఘిస్తే ఎలా. విచారకరమైన విషయం ఏమిటంటే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి నిమ్మల రామానాయుడు, ఇతర ఉన్నత అధికారులందరూ నిరంతరం టన్నెల్ వద్దకు వెళ్లి పనుల పర్యవేక్షణ, పరిశీలన చేస్తారు తప్ప, ఏనాడైనా నిర్వాసిత గ్రామాలకు వచ్చి, క్షేత్రస్థాయిలో జరుగుతున్నటువంటి కృషి ఏమిటి, నిర్వాసితులలో నెలకొన్న ఆందోళనలు ఏమిటి. అన్నటువంటి దాని పై సమగ్ర సమీక్ష లేకపోవడం దారుణమైన విషయం. ఇప్పుడు నిర్వాసితులుగా ఉన్నటువంటి వారి ఆక్రందన ఏమిటంటే, భవిష్యత్ తరాల కోసం మేము మా భూములను, తరతరాలుగా నివసిస్తున్న గ్రామాలను వదిలి కట్టుబట్టలతో బయటకు వెళ్లి పోవాలా. ఏమిటి ఈ అన్యాయం అని ప్రశ్నిస్తున్నారు. కావున ఈ ప్రశ్నకు పాలకులు పరిష్కారం వెతకాలి. నిజాయితీగా పూర్తిస్థాయి పునరావాస ఏర్పాట్లు చేసిన తరువాతనే ట్రయల్ రన్ నిర్వహించాలి. బలవంతంగా ఖాళీ చేయించడానికి పూనుకుంటే ప్రజల నుండి ప్రతిఘటన తప్పదు. ప్రభుత్వం అప్రతిష్ట మూటగట్టుకోక మానదు. నిర్వాసితులకు ప్రాజెక్టు ఏరియా పరిధిలోని ప్రజలందరూ తప్పనిసరిగా సంఘీభావంగా, బాసటగా వారి న్యాయమైన కోర్కెను బలపరుస్తూ వారి ఆందోళనలో ప్రత్యక్షంగా భాగస్వాములు కావాలని సీనియర్ సిటిజన్స్ ఫోరం అధ్యక్షులు ప్రజానీకాన్ని కోరుతున్నారు.

## 'హర్ ఘర్ తిరంగా' ర్యాలీలో తహసిల్దార్, మండల విద్యాశాఖ అధికారులు

(షణ్ముఖ వెలుగు, నూజండ్ల, ఆగస్టు 12)






మండల కేంద్రంలో 'హర్ ఘర్ తిరంగా' ర్యాలీ మండల పరిషత్ కార్యాలయం నుండి బస్టాండ్ సెంటర్ వరకు సాగిన ఈ కార్యక్రమంలో తహసిల్దార్ రమేష్ కుమార్, మండల విద్యాశాఖ అధికారులు కాకర్ల సత్యనారాయణ, నలబోలు రవిచంద్ర, మండల అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ శ్రీనివాసరావు, ప్రధానోపాధ్యాయులు శ్రీదేవి, ఉపాధ్యాయులు సైకిల్ తొక్కుతూ చేతిలో మువ్వన్నెల జెండా పట్టుకుని అంగనవాడి కార్యకర్తలతో కలిసి ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా తహసిల్దార్ మాట్లాడుతూ కుల, మత, ప్రాంత, రాజకీయాలకు అతీతంగా 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమాన్ని ప్రజా ఉద్యమంగా చేయాలని తెలియజేశారు. ప్రతి ఒక్కరూ తమ ఇంటిపై త్రివర్ణ పతాకాన్ని ఎగురవేసి దేశభక్తిని చాటుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆయా శాఖల అధికారులు,పంచాయతీ కార్యదర్శులు నాగూర్ లాలు, రామకృష్ణ, వెంకటేశ్వర్లు, నిడమానూరి రత్నం, వెలుగు, ఎన్ఆర్ఇజిఎస్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# ఓటర్ల ప్రత్యేక సవరణ పై ప్రత్యేక ప్రచార దినాలు

### జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ శ్రీధర్ చెరుకూరి

(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, కడప, ఆగస్టు 12)




ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ఆదేశాల మేరకు జిల్లాలో ప్రత్యేక ప్రచార దినాలను నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ శ్రీధర్ చెరుకూరి తెలిపారు. 2026 ఆగస్టు 22, 23, 29, 30 తేదీల్లో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఆయా పోలింగ్ కేంద్రాల్లో ప్రత్యేక ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ప్రత్యేక ప్రచార దినాల్లో ప్రతి పోలింగ్ కేంద్రంలో బూత్ స్థాయి అధికారులు, రాజకీయ పార్టీల బూత్ స్థాయి ఏజెంట్లు అందుబాటులో ఉంటారని తెలిపారు. ముసాయిదా ఓటర్ల జాబితా, సంబంధిత జాబితాలతో పాటు అవసరమైన 6, 7, 8, 8ఏ దరఖాస్తు ఫారాలు అందుబాటులో ఉంచి, ఓటర్లకు దరఖాస్తుల స్వీకరణ, సందేహాల నివృత్తి, మార్గదర్శకత్వం అందిస్తారన్నారు. 18--19 సంవత్సరాల యువ ఓటర్లను పెద్దఎత్తున ఓటర్ల జాబితాలో నమోదు చేయడంతో పాటు, ముసాయిదా జాబితాలో నమోదు కాకుండా మిగిలిపోయిన అర్హులైన ఓటర్లను గుర్తించి చేర్చేందుకు ఈ ప్రత్యేక ప్రచార దినాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ తెలిపారు. ప్రత్యేక ప్రచార దినాలపై ప్రజలకు విస్తృత ప్రచారం కల్పించాలని, రాజకీయ పార్టీలకు ముందస్తుగా సమాచారం అందించాలని అధికారులను ఆదేశించారు. బూత్ స్థాయి అధికారులు స్వీకరించిన ప్రతి దరఖాస్తుపై భౌతిక పరిశీలన, స్థానిక విచారణ పూర్తి చేసి సంబంధిత ఎన్నికల నమోదు అధికారికి సమర్పించాలని తెలిపారు. అలాగే, స్వీకరించిన దరఖాస్తుల వివరాలను రోజువారీగా నమోదు చేయడంతో పాటు, దరఖాస్తులను నిర్ణీత గడువులోగా పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. ప్రత్యేక ప్రచార దినాల్లో బూత్ స్థాయి అధికారులు విధులకు గైర్హాజరైతే ఫిర్యాదులను తీవ్రంగా పరిగణించి, సంబంధిత ఎన్నికల నమోదు అధికారి, సహాయ ఎన్నికల నమోదు అధికారి, బూత్ స్థాయి అధికారుల పై క్రమశిక్షణ రాహిత్య చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.

# కడప జిల్లా ఆర్యవైశ్య సంఘం

## నూతన కమిటీ సభ్యులను ఘనంగా సత్కరించిన కుటుంబీకులు

(షణ్ముఖ వెలుగు, బద్వేల్, ఆగస్టు 12)

కడప జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులుగా వల్లంకొండు వెంకటరమణ, గౌరవ అధ్యక్షులుగా పివిఎన్ ప్రసాద్, కేవి సుబ్బారావు, సెక్రటరీగా సివి నాగేశ్వరరావు, ట్రెజరర్‌గా పబ్బతి చంద్రశేఖర్, ఉద్యోగుల కమిటీ వైస్ చైర్మన్‌గా పబ్బతి చక్రపాణి, పబ్లిక్ రిలేషన్ కమిటీ చైర్మన్ పత్తి వెంకట నరసింహారావు, పొలిటికల్ కమిటీ వైస్ చైర్మన్ ఎస్వి సుబ్బారావు (గురు)తో పాటు పలువురిని ప్రముఖ యాదవ సంఘం నాయకులు తోడేటి సుబ్బయ్య (యాదవ్), తిరుపతమ్మ కుటుంబ సభ్యులు పలువురికి శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. జిల్లా కమిటీలో ఎన్నికైన పలువురు ఆర్యవైశ్యులు తోడేటి సుబ్బయ్య కుటుంబీకులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా తోడేటి సుబ్బయ్య యాదవ్ మాట్లాడుతూ బద్వేలు పట్టణంలో అనేక సంవత్సరాలుగా సేవా కార్యక్రమాలు చేస్తున్నటువంటి వారి సేవలను గుర్తించి జిల్లా సంఘంలో అధ్యక్షులుగా వారిని నియమించడం సంతోషకరమన్నారు. రాబోవు రోజుల్లో కూడా మరెన్నో పదవులు అలంకరించాలని వారు ఆకాంక్షించారు.





## 23న వ్యాసరచన పోటీలు

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఆగస్టు 12)

తెలుగు భాషా దినోత్సవ సందర్భాన్ని పురస్కరించుకొని కళామిత్రమండలి (తెలుగు లోగిలి) సంస్థ ఆధ్వర్యంలో 23వ తేదీన ఆదివారం ఉదయం 10 గంటలకు స్థానిక ఒంగోలులోని ఆదిత్య డిగ్రీ కాలేజీ ఆవరణలో పాఠశాల, కళాశాల స్థాయి విద్యార్థులకు "తెలుగు భాష గొప్పతనం" అనే అంశం పై వ్యాసరచన పోటీలను నిర్వహిస్తున్నట్లు సంస్థ అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ నూనె అంకమ్మరావు, సింహాద్రి జ్యోతిర్మయిలు ఒక ప్రకటనలో తెలిపారు. పోటీల్లో గెలుపొందిన విజేతలకు 29న శనివారం సాయంత్రం స్థానిక ఒంగోలులోని సివియన్ రీడింగ్ రూం ఆవరణలో జరిగే "తెలుగు భాషా దినోత్సవం" కార్యక్రమంలో అందజేస్తామని తెలిపారు. పూర్తి వివరాలకు 9866014619 నెంబర్‌ను సంప్రదించాలన్నారు.

## వ్యాపార రంగంలో చంద్రశేఖర్‌రెడ్డి దిన దినాభివృద్ధి చెందాలి

### మాజీ మంత్రులు హరీష్‌రావు, బాలినేని శ్రీనివాసరెడ్డి, ఏరాసు ప్రతాపరెడ్డి, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ గుంటక





(షణ్ముఖ వెలుగు, హైదరాబాద్, ఆగస్టు 12)

ప్రముఖ వ్యాపారవేత్త, స్టాండర్డ్ ఫ్లోరా ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్ సి చంద్రశేఖర్‌రెడ్డికి చెందిన వ్యాపార గోడౌన్ ప్రారంభోత్సవ కార్యక్రమం హైదరాబాద్ నగరంలో మంగళవారం అట్టహాసంగా జరిగింది. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర బిఆర్ఎస్ మాజీ మంత్రి తన్నీరు హరీష్‌రావు, ఆంధ్రప్రదేశ్ జనసేన పార్టీ రాష్ట్ర నాయకులు, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి, మాజీ మంత్రి ఏరాసు ప్రతాపరెడ్డి, మార్కాపురం మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ గుంటక సుబ్బారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వ్యాపార రంగంలో అడుగుపెట్టిన చంద్రశేఖర్‌రెడ్డి అనతి కాలంలోనే అభివృద్ధి చెంది, ప్రముఖ వ్యాపారవేత్తగా ఎదగాలని ఆకాంక్షించారు. వ్యాపార రంగంలో కస్టమర్ల నమ్మకానికి పెద్ద పీట వేసి నాణ్యమైన వస్తువులను అందించాలని యాజమాన్యానికి సూచించారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో మాజీ డిఆర్‌యుసిసి మెంబర్ ఎం ఎన్ రెడ్డి, షేక్ అన్వర్ హుస్సేన్, రాఘవరెడ్డి, సత్యనారాయణరెడ్డి, రాజకీయ ప్రముఖులు, వివిధ రాష్ట్రాలకు చెందిన వ్యాపారవేత్తలు, పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## యుటిఎఫ్ ప్రకాశంజిల్లా శాఖ ఆధ్వర్యంలో 26వ ఎస్‌టిఎఫ్ఐ ఆవిర్భావ దినోత్సవం

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఆగస్టు 12)

యుటిఎఫ్ ప్రకాశం జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ అబ్దుల్ హై అధ్యక్షతన ఎస్‌టిఎఫ్ఐ ఆవిర్భావ దినోత్సవ జెండా ఆవిష్కరణ జరిగింది. ఒంగోలులోని యుటిఎఫ్ జిల్లా కార్యాలయం నందు ఎస్‌టిఎఫ్ఐ జాతీయ కౌన్సిల్ సభ్యులు కొమ్మోజు శ్రీనివాసరావు ఎస్ టిఎఫ్ఐ జెండా ఆవిష్కరణ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 2000 సంవత్సరంలో దాచురి రామిరెడ్డి ఆధ్వర్యంలో జాతీయ స్థాయిలో అన్ని రాష్ట్రాలలో ఉపాధ్యాయుల ఫెడరేషన్‌ను కలుపుకొని ఒక ఉపాధ్యాయుల ఫోరంను ఏర్పాటు చేసి దానిని స్కూల్ టీచర్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా అని నామకరణం చేసి దానికి వ్యవస్థాపక జాతీయ ప్రధాన కార్యదర్శిగా ఎన్నికయ్యారు. వారిని ఆదర్శంగా తీసుకొని ఉపాధ్యాయులకు స్పెషల్ టెట్ నిర్వహించాలి. జాతీయస్థాయిలో ఎస్‌టిఎఫ్ఐ, రాష్ట్ర స్థాయిలో యుటిఎఫ్ రాష్ట్ర సంఘం, జిల్లా శాఖలు చేసిన అనేక పోరాటాల ఫలితంగా రాష్ట్ర ప్రభుత్వం త్వరలోనే ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు స్పెషల్ టెట్ నిర్వహిస్తుందని రాష్ట్ర విద్యాశాఖ కమిషనర్, విద్యాశాఖ అధికారులు తెలియజేశారని తెలిపారు. ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు ప్రత్యేకించి ఆఫ్ లైన్లో పరీక్షలు నిర్వహించాలని, మినిమం పాస్ మార్కులను అందరికీ సమానంగా 40 శాతం మార్కులను ప్రయారిటీ తీసుకోవాలని, ప్రత్యేకించి ఏ సబ్జెక్ట్ బోధిస్తారో ఆ సబ్జెక్టుకు సంబంధించిన అంశాలలో మాత్రమే ఉపాధ్యాయులకు టెట్ పరీక్ష నిర్వహణ చేయాలని, ఆర్‌టి యాక్ట్ 23(1) సబ్ క్లాజ్‌ను సవరణ చేయాలని ప్రభుత్వానికి కోరారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే దీని మీద కమిటీ వేసి ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు స్పెషల్ టెట్ నిర్వహణకు ఏర్పాటు చేయాలని ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. యుటిఎఫ్ రాష్ట్ర సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎస్ రవి, జిల్లా సహాధ్యక్షుడు వై వెంకట్రావు, జిల్లా కోశాధికారి ఎన్ చిన్న స్వామి, సీనియర్ నాయకులు డి వీరాంజనేయులు, సిహెచ్ ప్రభాకర్ రెడ్డి,జి హరిబాబు, ఎస్ బ్రహ్మయ్య,కె శేషగిరి, సిపిఎస్ జిల్లా కన్వీనర్ ఆర్ నారాయణ, కాట్రగడ్డ నరసింహారావు,డి వీరనారాయణ, పి వెంకట్రావు, తదితరులు పాల్గొన్నారు.

# బ్రహ్మంగారి మఠం వాసవి ఆలయానికి కడప దాత ముచ్చర్ల కుటుంబం వెండి కానుకలు బహూకరణ

(షణ్ముఖ వెలుగు, బ్రహ్మంగారి మఠం, ఆగస్టు 12)

స్థానిక శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయంలో అమ్మవారి బిందె సేవ నిమిత్తం కడపకు చెందిన ప్రముఖ దాతలు, రిటైర్డ్ గ్రామీణ బ్యాంక్ సీనియర్ మేనేజర్ ముచ్చర్ల వెంకటసుబ్బయ్య, లక్ష్మీదేవి దంపతులు, వారి కుమారుడు కిషోర్ కుమార్, లక్ష్మీ కల్పన దంపతులు రూపొందించిన వెండి ముఖ విలాసము మరియు వెండి గొడుగును అత్యంత భక్తిశ్రద్ధలతో బహూకరించారు. ఆలయ పూర్వ అధ్యక్షులు కీర్తిశేషులు ముచ్చర్ల చిన్న వెంకటసుబ్బయ్య శ్రేష్టి జ్ఞాపకార్థం, వారి కుటుంబ సభ్యులు ఈ విశేష కానుకలను ఆలయానికి అందజేశారు.

### దాతలకు ఘన స్వాగతం – ప్రత్యేక పూజలు

కానుకలు సమర్పించేందుకు ఆలయానికి విచ్చేసిన దాతల కుటుంబ సభ్యులకు ఆలయ కమిటీ అధ్యక్షులు అయ్యపు వెంకట సురేష్ బాబు మరియు సభ్యులు పూర్ణకుంభంతో, ఆలయ మర్యాదలతో పూర్వపు సంప్రదాయబద్ధంగా ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆలయ ప్రధాన పూజారి చౌడేశ్వర శర్మ గారి ఆధ్వర్యంలో దాతలకు ప్రత్యేక సంకల్పం చెప్పించి, శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారికి విశేష కుంకుమార్చనలు, ప్రత్యేక పూజా కార్యక్రమాలు శాస్త్రోక్తంగా నిర్వహించారు.

### అమ్మవారికి వెండి అలంకరణ

దాతలు అందజేసిన వెండి ముఖ విలాసము, వెండి గొడుగుకు పూజారి చౌడేశ్వరశర్మ మంత్రోచ్ఛారణల మధ్య పవిత్ర సంప్రోక్షణ గావించారు. అనంతరం ఆ వెండి ఆభరణాలతో అమ్మవారిని దివ్యంగా అలంకరించి, ధూపదీప నైవేద్యాలు సమర్పించారు. అమ్మవారికి ఈ వెండి కానుకలను బహుకరించి తమ భక్తిప్రపత్తులను చాటుకున్న దాతల ఉదారతను ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు ముక్తకంఠంతో కొనియాడారు.

### ఘనంగా సన్మానం

అమ్మవారి సేవలో భాగస్వాములైన దాతలను ఆలయ కమిటీ అధ్యక్షులు అయ్యపు వెంకట సురేష్ బాబు గారు దుశ్శాలువాలు కప్పి, శేషవస్త్రాలతో ఘనంగా సన్మానించారు. అనంతరం అమ్మవారి శేషవస్త్రాలు, పసుపు-కుంకుమలు, తీర్థప్రసాదాలు అందజేసి ఆశీర్వచనాలు అందించారు. ఆలయాభివృద్ధికి మరియు ఆధ్యాత్మిక కార్యక్రమాలకు దాతలు అందిస్తున్న సహకారం అభినందనీయమని
కమిటీ ప్రతినిధులు కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు, కార్యవర్గ సభ్యులు, మహిళా మండలి సభ్యురాళ్లుపెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని దాతల సేవా నిరతిని కొనియాడారు.









# మండలంలో "బుధవారం కార్యక్రమం"

(షణ్ముఖ వెలుగు, పెద్దారవీడు, ఆగస్టు 12)

తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, రాష్ట్ర మంత్రి నారా లోకేష్, యర్రగొండపాలెం నియోజకవర్గ ఇన్చార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు ఆదేశాల మేరకు మండలంలో "బుధవారం కార్యక్రమం" ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి మండల అధ్యక్షుడు మెట్టు శ్రీనివాస్‌రెడ్డి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా మండలంలోని ప్రజా సమస్యల పై చర్చించారు.



తెలుగుదేశం పార్టీ కార్యాలయం ఏర్పాటు, వివిధ సంక్షేమ కార్యక్రమాల తీర్మానాల పై చర్చించారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌ఛార్జి గొట్టం శ్రీనివాస్‌రెడ్డి, ఏపిఆర్‌డీసీ డైరక్టర్ నక్కా శ్రీను, చంద్రగుట్ల నాగేశ్వరరావు, మాజీ మండల అధ్యక్షులు, లింగాల అబ్రహం, నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షులు, యూనిట్ ఇంచార్జిలు ఆకుమల శ్రీనివాస్‌రెడ్డి, యేరువ పాపిరెడ్డి, తోకల ఎల్లయ్య, నాసర్‌రెడ్డి, దుగ్గంపూడి పెద్ద కొండారెడ్డి, నియోజకవర్గ నాయకులు అనేకళ్ళ శ్రీనివాసులురెడ్డి, యూనిట్ కో కన్వీనర్ తిరుమలరెడ్డి వెంకటరెడ్డి, నీటి సంఘం అధ్యక్షులు దుగ్గెంపూడి చిన్న కొండారెడ్డి, యేరువ అచ్చిరెడ్డి, చిమట గాలయ్య, సొసైటీ డైరెక్టర్ ఉప్పలపాటి చిన్నశేషు, గోదాపు సత్యంరెడ్డి, కొనంగి పాలంకయ్య, బచ్చు ఆదినారాయణరెడ్డి, పత్తి శ్రీనివాసరావు, పోలేబోయిన వెంకటరమణ, చిన్న యేసు, యేరువ మల్లారెడ్డి, కందుల కాశిరెడ్డి, దుద్దెల కోటిరెడ్డి, వెన్నా సుబ్బారెడ్డి, చిలక కోటయ్య, వల్లేబోయిన వెంకట్, యాతం సత్యనారాయణరెడ్డి, తిరుమలరెడ్డి సుధాకర్‌రెడ్డి, నరాల వెంకటేశ్వర్లు, బొదనపు సూర్యనారాయణరెడ్డి, ఐటీడీపీ నాగేశ్వర్‌రెడ్డి, కుర్రా శివసాయి, కన్నెబోయిన చక్రవర్తి, తదితరులు పాల్గొన్నారు.

# భారతదేశం శరీరమైతే...... భారతదేశ సంస్కృతి ఆత్మ వంటిది





(షణ్ముఖ వెలుగు, పొదిలి, ఆగస్టు 12)

అమృతోత్సవాల్లో భాగంగా పొదిలి పట్టణంలో బుధవారం మండల పరిషత్ కార్యాలయం వద్ద నుండి చిన్న బస్టాండ్ సెంటర్ వరకు బెల్లంకొండ విజయలక్ష్మి ఆధ్వర్యంలో భారీ ర్యాలీ, అతి పెద్ద 100 మీటర్ల త్రివర్ణ పతాకంతో విద్యార్థులు జాతీయ జెండాలు ప్రదర్శిస్తూ దేశభక్తి నినాదాలతో పొదిలి పట్టణం మార్మోగించారు. ఈ ర్యాలీలో వీరిశెట్టి విద్యాసంస్థల విద్యార్థులు, బిట్స్ బెల్లంకొండ విద్యాసంస్థల ఫార్మసీ, డిగ్రీ విద్యార్థులు, సాయి పబ్లిక్ స్కూల్ విద్యార్థులు, ఏబీవీపీ విద్యార్థులు పాల్గొన్నారు. బిట్స్ బెల్లంకొండ విద్యాసంస్థలు కార్యనిర్వాహక సంచాలకులు బెల్లంకొండ విజయలక్ష్మి ప్రసంగిస్తూ భారతదేశం శరీరమైతే... భారతదేశ సంస్కృతి ఆత్మ వంటిదన్నారు. మన సంస్కృతి చాలా గొప్పదని, ఈ దేశంలో ఉన్న ప్రతి పౌరులు, యువత దేశ విచ్ఛిన్నకర శక్తుల భావజాలాలకు లోను కాకుండా, దేశభక్తి భావంతో దేశ సమగ్రతకు, ప్రజాస్వామ్య పరిరక్షణకు పాటుపడాలన్నారు. ఏబీవీపీ ఉమ్మడి ప్రకాశం జిల్లా కన్వీనర్ వయ్యావుల నాగచరణ్, ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ మెంబర్ మాలేపాటి నాగచరణ్ ప్రసంగిస్తూ దేశ్ రక్ష కౌన్ కరేగా, కౌన్ కరేగా, హమ్ కరేగా...హమ్ కరేగా... ఈ దేశాన్ని ఎవరు రక్షిస్తారు..? ఎవరు రక్షిస్తారు...? మేము రక్షిస్తాం.. మేము రక్షిస్తాం... పార్లమెంటులో "వందేమాతరం" గీతం చట్టబద్ధత చేశారని, ఈ దేశంలో ఉన్న ప్రతి పౌరుడు వందేమాతరం గీతం ఆలపించాలన్నారు. బిట్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ బెల్లంకొండ శ్రీనివాసరావు ప్రసంగిస్తూ మనదేశంలో విభిన్న కులాలు, మతాలు, జాతులు, సంస్కృతులు కలిగిన దేశమని, అంటే భారతదేశం భిన్నత్వంలో ఏకత్వం కలిగిన దేశమని, దేశభక్తి భావంతో క్లిష్ట సమస్యలు వచ్చినప్పుడు ఏకతాటిగా మేమంతా భారతీయులమనే భావంతో దేశభక్తి భావంతో ఉండాలన్నారు. వీరిశెట్టి విద్యాసంస్థల అధినేత మద్దుల శ్రీనివాసులు, మార్కాపురం జిల్లా బిజెపి మైనార్టీ మోర్చా అధ్యక్షులు సయ్యద్ ఖాదర్ భాషా, సీనియర్ నాయకులు మాగులూరి రామయ్య, బీజేపీ మండల అధ్యక్షులు దోర్నాల రమణారెడ్డి, మైనార్టీ మూర్తి ఉపాధ్యక్షులు మాబు, సర్ బిజెపి జిల్లా కన్వీనర్ మండల శివప్రసాద్, చిట్టెంశెట్టి శ్రీనివాసులు, పువ్వాడ నారాయణ, సాయి పబ్లిక్ స్కూల్ సిబ్బంది, బిట్స్ విద్యాసంస్థలు, వీరిశెట్టి విద్యాసంస్థల సిబ్బంది ర్యాలీలో పాల్గొని సంఘీభావం తెలియజేశారు. పొదిలి సిఐ రాజేష్‌కుమార్, పొదిలి ఎస్ఐ సూరెడ్డి రాజేష్‌లు తమ సిబ్బందితో ట్రాఫిక్ అంతరాయం లేకుండా ర్యాలీకి సహకరించారు.

# ఒంగోలు పార్లమెంటు టీడీపీ కార్యాలయ భవన నిర్మాణ పనులను పరిశీలించిన పార్లమెంటు అధ్యక్షులు డాక్టర్ ఉగ్ర నరసింహారెడ్డి





(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఆగస్టు 12)

ఒంగోలు పార్లమెంటు టీడీపీ కార్యాలయ భవన నిర్మాణ పనులను బుధవారం ఒంగోలు పార్లమెంటు అధ్యక్షులు, కనిగిరి నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర నరసింహారెడ్డి కమిటీ సభ్యులతో కలిసి సందర్శించి, పరిశీలించారు. ఈ సందర్భంగా భవన నిర్మాణ పనుల పురోగతిని ఆయన అధికారులను, సంబంధిత సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. కార్యాలయ భవన నిర్మాణ పనులను నాణ్యతా ప్రమాణాలను పాటిస్తూ, నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని ఆయన సూచించారు. పార్టీ కార్యకలాపాలను మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు కార్యాలయం అన్ని సౌకర్యాలతో అందుబాటులోకి రావడం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని ఆయన పేర్కొన్నారు. టీడీపీ బలోపేతానికి కార్యాలయం కీలక వేదికగా నిలుస్తుందని తెలిపారు. భవన నిర్మాణ పనులను వేగవంతం చేసి త్వరితగతిన పూర్తి చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఒంగోలు పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి కొఠారి నాగేశ్వరరావు, ఉపాధ్యక్షురాలు షేక్ ఆరిఫా, కార్యనిర్వహక కార్యదర్శులు గార్లపాటి శ్రీనివాసరావు, కసుకుర్తి అంకరాజు, కార్యదర్శి తంజావూరి శ్రీనివాసమూర్తి, మండపల్లి శ్రీను, జిల్లా మాజీ ఎస్సీ సెల్ అధ్యక్షులు చుండి శ్యామ్, షేక్ మస్తాన్ వలి, కుంచాల శ్రీను, రమేష్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, కార్యాలయ నిర్మాణానికి సంబంధించిన సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# ఉచిత క్యాన్సర్ శిబిరానికి విశేష స్పందన
# 100 మందికి పైగా రోగులకు పరీక్షలు





(షణ్ముఖ వెలుగు, యర్రగొండపాలెం, ఆగస్టు 12)

యర్రగొండపాలెం ప్రభుత్వ ఏరియా వైద్యశాలలో ఒంగోలుకు చెందిన హెచ్సీజీ ఎంఎన్ఆర్ క్యాన్సర్ వైద్యశాల ఆధ్వర్యంలో బుధవారం భారీ ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్, అవగాహన ఆరోగ్య శిబిరాన్ని నిర్వహించారు. గ్రామీణ ప్రజలకు క్యాన్సర్‌పై ముందస్తు అవగాహన కల్పించడంతో పాటు ప్రారంభ దశలోనే వ్యాధిని గుర్తించే లక్ష్యంతో ఈ శిబిరాన్ని ఏర్పాటు చేశారు.

### వివిధ రకాల క్యాన్సర్లకు ఉచిత పరీక్షలు

శిబిరంలో గర్భాశయ క్యాన్సర్, రొమ్ము క్యాన్సర్, వృషణ క్యాన్సర్, ప్రోస్టేట్ క్యాన్సర్‌తో పాటు సిఏ-125 రక్త పరీక్షలు నిర్వహించారు. నిపుణులైన వైద్యులు ప్రతి రోగిని క్షుణ్ణంగా పరీక్షించి, అవసరమైన వారికి తదుపరి చికిత్స,జాగ్రత్తలపై సూచనలు అందించారు. ఈ సందర్భంగా ఎంబీబీఎస్, ఎండీ (సర్జికల్ ఆంకాలజీ) వైద్య నిపుణుడు డాక్టర్ యశ్వంత్ నాగేంద్ర మాట్లాడుతూ క్యాన్సర్ వ్యాధిని ప్రారంభ దశలోనే గుర్తించి సరైన వైద్య చికిత్సలు అందిస్తే ప్రాణాపాయం లేకుండా పూర్తిగా నియంత్రించవచ్చని తెలిపారు. క్యాన్సర్ వ్యాధి వివిధ దశల్లో గుర్తించబడుతుందని, ప్రతి దశకు అనుగుణంగా ప్రత్యేక వైద్య చికిత్సలు అందుబాటులో ఉన్నాయని వివరించారు. సకాలంలో వైద్యులను సంప్రదించి చికిత్స ప్రారంభిస్తే వ్యాధిని సమర్థవంతంగా అరికట్టవచ్చని పేర్కొన్నారు.లక్షణాలు కనిపిస్తే నిర్లక్ష్యం చేయొద్దు. క్యాన్సర్ లక్షణాలు కనిపించిన వెంటనే వైద్యులను సంప్రదించి అవసరమైన పరీక్షలు చేయించుకోవాలని డాక్టర్ యశ్వంత్ నాగేంద్ర సూచించారు. ప్రజల్లో అవగాహన పెరగడం, ముందస్తు నిర్ధారణ, సరైన చికిత్సతో క్యాన్సర్‌ను జయించే అవకాశాలు మరింత మెరుగుపడతాయని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా హెచ్‌సీజీ క్యాన్సర్ కేర్ సెంటర్ ముఖ్య నిర్వహణాధికారి నరసింహ మూర్తి సాతులూరి క్యాన్సర్‌ను ముందస్తు దశలోనే గుర్తిస్తే చికిత్స విజయవంతమయ్యే అవకాశాలు మరింత మెరుగుపడతాయని తెలిపారు. క్యాన్సర్‌పై ప్రజలు అవగాహన పెంచుకోవాలని సూచించారు. వ్యాధిని ప్రారంభ దశలోనే గుర్తించడం ద్వారా సకాలంలో తగిన వైద్య చికిత్స అందించి మెరుగైన ఫలితాలు సాధించవచ్చని పేర్కొన్నారు.

### అవగాహనే రక్షణకు తొలి అడుగు

క్యాన్సర్‌పై భయపడకుండా అవగాహనతో వ్యవహరించాలని, క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవడం ద్వారా వ్యాధిని ప్రారంభ దశలోనే గుర్తించి ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని ఆయన పిలుపునిచ్చారు.

### గ్రామీణ ప్రజల నుంచి విశేష స్పందన

చుట్టుపక్కల గ్రామాలు, మారుమూల ప్రాంతాల నుంచి 100 మందికిపైగా రోగులు శిబిరానికి హాజరై ఉచిత వైద్య సేవలను వినియోగించుకున్నారు.మహిళలు, వృద్ధులు అధిక సంఖ్యలో పాల్గొని క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు చేయించుకున్నారు.

### వైద్య బృందానికి ప్రజల అభినందనలు

గ్రామీణ ప్రాంత ప్రజలకు ఉచితంగా క్యాన్సర్ స్క్రీనింగ్ నిర్వహించి, ముందస్తు నిర్ధారణకు అవకాశం కల్పించిన ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి వైద్య బృందం, హెచ్సీజీ ఎంఎన్ఆర్ క్యాన్సర్ ఆసుపత్రి వైద్యులను ప్రజలు అభినందించారు. ఈ సందర్భంగా యర్రగొండపాలెం ప్రభుత్వ ఏరియా వైద్యశాల మెడికల్ సూపరింటెంట్ డాక్టర్ దేవర యాదిద్యా మాట్లాడుతూ ప్రజారోగ్య పరిరక్షణే లక్ష్యంగా భవిష్యత్తులో కూడా ఇటువంటి ఉచిత ఆరోగ్య శిబిరాలను మరిన్ని నిర్వహించి, గ్రామీణ ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బి సురేష్ కుమార్, సేల్స్ హెడ్, ఎస్ మెహర్ కుమార్, మార్కెటింగ్ మేనేజర్, ఎం రాజేష్, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్, హెచ్‌సీజీ ఎంఎన్ఆర్ క్యాన్సర్ ఆసుపత్రి, ఒంగోలు వైద్య బృందం, తదితరులు పాల్గొన్నారు.





# జిల్లా హాకీ అండర్ 17 జట్టుకు ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల ఎంపిక



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఆగస్టు 12)

అమరావతి కప్ ఛాంపియన్‌షిప్ టోర్నమెంట్‌లో భాగంగా మినీ స్టేడియంలో నిర్వహించిన జిల్లా హాకీ అండర్ 17 ఎంపికల్లో మద్దిపాడు ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు జిల్లా జట్టుకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా బుధవారం పాఠశాలలో నిర్వహించిన అభినందన సభలో ఎంపికైన విద్యార్థులను పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి మాల్యాద్రి, పీడీ కె వనజ, జె సౌజన్య అభినందించారు. త్వరలో తిరుపతిలో జరగనున్న అమరావతి కప్ ఛాంపియన్‌షిప్ టోర్నమెంట్‌లో జిల్లా జట్టు తరపున విద్యార్థులు పాల్గొననున్నట్లు వారు తెలిపారు. క్రీడల్లో విద్యార్థులు రాణించడం పాఠశాలకు గర్వకారణమని పేర్కొంటూ, టోర్నమెంట్‌లో ప్రతిభ కనబరచి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. జిల్లా జట్టుకు ఎంపికైన వారిలో కె సిరివల్లి, ఎం అను, వి మణికర్ణిక, స్రవంతి, అలేఖ్య, వి సత్య, ఎం గాయత్రీ, రవితేజ, శాంతి మనోహర్ ఉన్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, విద్యార్థులు ఎంపికైన క్రీడాకారులకు అభినందనలు తెలిపారు.

# పర్యావరణం కాపాడటం ప్రతి విద్యార్థి బాధ్యత

### ఉపకులపతి ప్రొఫెసర్ డివిఆర్ మూర్తి



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఆగస్టు 12)

ఆంధ్ర కేసరి విశ్వవిద్యాలయం నందు వనమహోత్సవ కార్యక్రమం ను ఉపకులపతి ప్రొఫెసర్ డివిఆర్ మూర్తి అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి వారు మాట్లాడుతూ పర్యావరణాన్ని కాపాడుకోవడం మన అందరి సామాజికబాధ్యత అని ప్రతి విద్యార్థి, ఎన్ఎస్ఎస్ వాలంటీర్స్ గ్రామాలలోనూ వాళ్ళు నివసించే పరిసర ప్రాంతాలలోనూ, కమ్యూనిటీలోనూ మొక్కలను విరివిగా నాటి వాతావరణ సమతుల్యతకు పాటుపడాలని అదేవిధంగా ప్రతి సిబ్బంది విశ్వవిద్యాలయంలో ఒక మొక్కను దత్తత తీసుకొని పరిరక్షించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయ రిజిస్టర్ ప్రొఫెసర్ హరిబాబు మాట్లాడుతూ మొక్కల పెంపకంలో విద్యార్థిని విద్యార్థులు పాలి భాగస్తులు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో విశ్వావిద్యాలయ ప్రిన్సిపాల్ నిర్మలమణి మాట్లాడుతూ మొక్కల పెంపకం ద్వారా గాలిలోని ఆక్సిజన్ శాతం పెరుగుతుందని విద్యార్థినీ విద్యార్థులు మొక్కల పెంపకంలో భాగస్వామ్యం కావాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమం నిర్వహణ సమన్వయకర్త విశ్వవిద్యాలయ ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ మండే హర్ష ప్రీతం దేవ్‌కుమార్ మాట్లాడుతూ దేశంలో 60 శాతం అడవులను అభివృద్ధి చేసుకోవాలని తద్వారా ఆక్సిజన్ శాతం పెంచుకోవాలని అలాగే ప్లాస్టిక్ వినియోగము తగ్గించాలని కార్బన్డయాక్సైడ్ శాతం తగ్గించాలని ప్రతి విద్యార్థి వాతావరణ సమతుల్యతకు కంకణ బద్ధులై ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో అక్కడమిక్ కోఆర్డినేటర్ ప్రొఫెసర్ రాజమోహన్ కంట్రోల్ ఆఫ్ ఎగ్జామినేషన్ ప్రొఫెసర్ జి సోమశేఖర, డీన్ సిడిసి ప్రొఫెసర్ కెవిన్ రాజు, స్టూడెంట్ అఫైర్స్ ప్రొఫెసర్ భారతీదేవి, సోషల్ వర్క్ హెచ్ఓడి ఆర్ శ్రీనివాస్, ఫిషరీస్ డిపార్ట్మెంట్ డాక్టర్ పి సురేష్, అశ్వత్ నారాయణ, రాజ్యలక్ష్మి, కెమిస్ట్రీ డిపార్ట్మెంట్ ఎంవి ప్రసన్నలక్ష్మి, కంప్యూటర్ డిపార్ట్మెంట్ ఎం ప్రభావతి, తోటమాలి రమేష్, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేశారు.



# రెండు నెలల పాటు ఎయిడ్స్ అవగాహన కార్యక్రమాలు

(షణ్ముఖ వెలుగు, మార్కాపురం టౌన్, ఆగస్టు 12)

అంతర్జాతీయ యువత దినోత్సవం సందర్భంగా ఈనెల 11వ తారీఖు నుండి అక్టోబర్ 11వ తారీఖు వరకు రెండు నెలల పాటు ఉధృత ఎయిడ్స్ అవగాహనా కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు మార్కాపురం జిల్లా ఎయిడ్స్, టీబీ, లెప్రసి వ్యాధుల నియంత్రణాధికారి రాహుల్ తెలిపారు. అవగాహన కార్యక్రమాల్లో భాగంగా కళాజాత, ఫ్లాష్ మాబ్ కార్యక్రమాలు, టీవీ కలిగిన వాహనం ద్వారా హై రిస్క్ గ్రామాలలో ఎయిడ్స్ వ్యాధి పై విస్తృత అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. బుధవారం మార్కాపురంలోని అరవింద ఘోష్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అవగాహన కార్యక్రమంలో భాగంగా పుర వీధుల గుండా ర్యాలీ నిర్వహించారు. బుధవారం నుండి అక్టోబర్ 12వ తేదీ వరకు నిర్వహించనున్న అవగాహన కార్యక్రమాల్లో భాగంగా యువతలో హెచ్ఐవి ఎయిడ్స్ నివారణ ,నియంత్రణ పై అవగాహన కల్పించే ఉద్దేశ్యంతో వివిధ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో యువత కు ప్రధానంగా హెచ్ఐవి వ్యాధి వ్యాప్తి మార్గాలు, నివారణ చర్యలు,హెచ్ఐవి పరీక్షలు, ముందస్తు నిర్ధారణ యొక్క ప్రముఖ్యత, కౌన్సిలింగ్ వంటి చికిత్స సేవల లభ్యత, హెచ్ఐవితో జీవిస్తున్న వ్యక్తుల పట్ల వివక్ష, అపోహలను నివారించాల్సిన అంశాలు గూర్చి అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. యువత హెచ్ఐవీపై ఏమాత్రం అనుమానం ఉన్నా సమీపంలోని ఐసీటీసీ కేంద్రాల లో ఉచితంగా వైద్య పరీక్షలు చేయించుకోవాలని సాయి కిరణ్ తెలిపారు. హెచ్ఐవీ బాధితుల పై సామాజికంగా ఎలాంటి వివక్ష చూపకుండా, వారికి వైద్యపరంగా, నైతికంగా మద్దతుగా నిలవాలని కోరారు. ఎయిడ్స్ వ్యాధి అనగానే మరణం కాదని, వ్యాధిగ్రస్తులు సరైన చికిత్స తీసుకుంటే అందరిలాగా ఆరోగ్యంగా, సాధారణ జీవితం గడపవచ్చని జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి ఐతీ.సుజన అన్నారు. క్షయ వ్యాధిగ్రస్తులు, లైంగిక వ్యాదులు కలిగిన వారు వంటి హై రిస్క్ గ్రూపుల వారితో పాటు గర్భవతులు కూడా తప్పక తమ దగ్గరిలోని గవర్నమెంట్ హెచ్ఐవి టెస్టింగ్ కేంద్రంలో ఉచితంగా పరీక్ష చేయించుకోవచ్చని యాగ్నిక్ అన్నారు. స్కూళ్లు, కాలేజీలలో క్విజ్, వక్తృత్వ, వ్యాస రచన పోటీలు నిర్వహించి విద్యార్థి దశలోనే ఎయిడ్స్ వ్యాధి పై అవగాహన కలిగేలా చర్యలు తీసుకుంటామని ఎపిడేమియాలజిస్ట్ రోహిత్ అన్నారు. హెచ్ఐవీతో జీవిస్తున్న 95 శాతం మందికి తమ స్థితి తెలిసేలా పరీక్షలు చేయాలని, 95 శాతం ఏఆర్టీ ద్వారా చికిత్స అందించాలని, 99 శాతం మందిలో వైరల్ లోడ్ అణచివేయడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడాలని డాక్టర్ రాహుల్ కోరారు. ఎయిడ్స్ వ్యాధిపై ప్రజలలో అవగాహన కల్పించేందుకు ఎన్జీవోలు ఐసిటిసి సిబ్బంది రెడ్ రిబ్బన్ సభ్యులు గట్టిగా కృషి చేయాలని క్లస్టర్ ప్రోగ్రాం మేనేజర్ అమీన్ కోరారు. గ్రామాలకు మొబైల్ ఐసిటిసి వాహనం వచ్చినప్పుడు అవసరమైన వారు తప్పక హెచ్ఐవీ పరీక్ష చేయించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రాండ్, దిషా స్వచ్ఛంద సేవా సంస్థల సిబ్బంది, సూపర్వైజర్స్, ఏఎన్ఎంలు, ఆషా కార్యకర్తలు, ఇతరులు పాల్గొన్నారు.

# అంతర్జాతీయ యువజన దినోత్సవం సందర్భంగా న్యాయ విజ్ఞాన సదస్సు



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఆగస్టు 12)
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ వారి క్యాలెండర్ ఆఫ్ యాక్టివిటీస్‌లో భాగంగా అంతర్జాతీయ యువజన దినోత్సవాన్ని పురస్కరించుకొని, పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించే ఉద్దేశంతో బుధవారం ఒంగోలు పట్టణంలోని పి.వి.ఆర్. బాయ్స్ హైస్కూల్ నందు న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా ప్రధాన న్యాయమూర్తి ,జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ ఏ సత్యానంద్ ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. యువత దేశ భవిష్యత్తుకు వెన్నెముక వంటివారని, విద్యార్థి దశ నుంచే చట్టాలపై అవగాహన కలిగి, తమ హక్కులతో పాటు బాధ్యతలను కూడా తెలుసుకోవాలని ఆయన సూచించారు. అదనపు సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ తాత్కాలిక కార్యదర్శి సిహెచ్ వి రామకృష్ణ మాట్లాడుతూ ప్రతి ఒక్కరికీ న్యాయం అందుబాటులో ఉండేలా న్యాయ సేవాధికార సంస్థ అందిస్తున్న ఉచిత న్యాయ సేవల గురించి విద్యార్థులకు వివరించారు.

బాలల హక్కులు, మహిళల రక్షణ, సైబర్ నేరాలు, మాదకద్రవ్యాల దుష్ప్రభావాలు తదితర అంశాల పై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని సూచించారు. మండల విద్యాశాఖ అధికారి టి కిషోర్ బాబు మాట్లాడుతూ విద్యార్థులు విద్యతో పాటు సామాజిక బాధ్యతను కూడా పెంపొందించుకోవాలని, పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని అన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు డి. రాధిక మాట్లాడుతూ, విద్యార్థులకు న్యాయపరమైన అంశాలపై అవగాహన కల్పించేందుకు న్యాయ విజ్ఞాన సదస్సులు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని పేర్కొన్నారు. ఈ సందర్భంగా పర్యావరణ పరిరక్షణలో భాగంగా పాఠశాల ప్రాంగణంలో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి మరియు ఇతర అధికారులు, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు మొక్కలు నాటి వాటి సంరక్షణ బాధ్యతను తీసుకోవాలని సూచించారు. పర్యావరణాన్ని పరిరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని, మొక్కలను నాటడమే కాకుండా వాటిని సంరక్షించి పెంచడం ద్వారా భవిష్యత్ తరాలకు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించవచ్చని ఈ సందర్భంగా అధికారులు విద్యార్థులకు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.






## ఏపీ జూనియర్ మహిళల హాకీ జట్టు మేనేజర్‌గా రవికుమార్



(షణ్ముఖ వెలుగు, సంతనూతలపాడు, ఆగస్టు 12) మండలంలోని మైనంపాడు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పిఈటిగా పని చేస్తున్న తిరుమలశెట్టి రవికుమార్ ఆంధ్రప్రదేశ్ జూనియర్ మహిళల హాకీ జట్టు మేనేజర్ గా నియమితులయ్యారు. ఈ మేరకు హాకీ ఆంధ్రప్రదేశ్ ఉత్తర్వులు జారీ చేసింది. ఈనెల 12వ తేదీ నుండి 23వ తేదీ వరకు మహారాష్ట్రలోని పూణేలో నిర్వహించే 16వ హాకీ ఇండియా జూనియర్ మహిళల జాతీయ టోర్నమెంట్ లో పాల్గొనే ఆంధ్రప్రదేశ్ జట్టుకు రవికుమార్ మేనేజర్‌గా వ్యవహరించనున్నారు. ఈ సందర్భంగా ప్రకాశం జిల్లా హాకీ అసోసియేషన్ సెక్రటరీ ఏ సుందరరామిరెడ్డి అభినందనలు తెలిపారు

## మండల స్థాయి సమావేశం నిర్వహించిన మండల టీడీపీ అధ్యక్షులు చిట్యాల వెంగల్‌రెడ్డి




(షణ్ముఖ వెలుగు, యర్రగొండపాలెం, ఆగస్టు 12)
పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో టీడీపీ ఇంచార్జ్ గూడూరి ఎరిక్షన్‌బాబు ఆదేశాల మేరకు మండల టిడిపి అధ్యక్షులు చిట్యాల వెంగల్‌రెడ్డి ఆధ్వర్యంలో మండల స్థాయి సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలో ఉన్నటువంటి పలు సమస్యల పై తీర్మానం చేసి ప్రజా సమస్యల పరిష్కారం, అలాగే అభివృద్ధి కార్యక్రమాల పై చర్చించారు. ఈ కార్యక్రమంలో మంత్ర నాయక్, సత్యనారాయణ గౌడ్, వేగినాటి శ్రీను, తోట మహేష్ నాయుడు, షేక్ మస్తాన్ వలి, పోక వెంకటసుబ్బయ్య, సుందర దొర, క్లస్టర్ ఇంచార్జ్‌లు, యూనిట్ ఇన్చార్జ్‌లు, బూత్ ఇంచార్జ్‌లు, టిడిపి సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## కంజుల వెంకట్రామిరెడ్డి కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే ఇంటూరి



(షణ్ముఖ వెలుగు, కందుకూరు, ఆగస్టు 12)
మండలంలోని పందలపాడు గ్రామానికి చెందిన కంజుల వెంకట్రామిరెడ్డి తండ్రి కొండారెడ్డి ఇటీవల అనారోగ్యంతో చనిపోయారు. కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు బుధవారం వెంకట్రామిరెడ్డి ఇంటికి వెళ్లి వారి కుటుంబాన్ని పరామర్శించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వెంట కందుకూరు మండల టిడిపి అధ్యక్షులు బుస్సారెడ్డి కృష్ణారెడ్డి, పట్టణ మాజీ అధ్యక్షుడు కంద్రా మాల్యాద్రి, నియోజకవర్గ తెలుగురైతు అధ్యక్షుడు అల్లం వెంకటేశ్వర్లు, రాష్ట్ర వాణిజ్య విభాగం కార్యనిర్వాహక కార్యదర్శి నాదెళ్ల వెంకటరమణయ్య, గ్రామ నాయకులు కంజుల రామచంద్రారెడ్డి, వర్ల దేవదాసు, పలువురు నాయకులు ఉన్నారు.

## ప్రజల సంక్షేమమే కూటమి ప్రభుత్వ ప్రధమ లక్ష్యం

### ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి







(షణ్ముఖ వెలుగు, మార్కాపురం టౌన్, ఆగస్టు 12)
ప్రజల సంక్షేమమే కూటమి ప్రభుత్వ ప్రధమ లక్ష్యమని మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి అన్నారు. బుధవారం మార్కాపురం మండల నాయుడుపల్లె "ఇంటింటికీ కూటమి ప్రభుత్వం-సంక్షేమ విజయాలు" కార్యక్రమంలో భాగంగా మార్కాపురం నియోజకవర్గ ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి నాయుడుపల్లె గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ప్రజలను కలుసుకున్నారు. ఈ సందర్భంగా వార్డు నాయకులు, ప్రజలు ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డికి ఘన స్వాగతం పలికారు. అనంతరం ప్రతి ఇంటికి వెళ్లి కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలనలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు, అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, ప్రజలకు అందుతున్న ప్రభుత్వ సేవలను వివరించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాల పై ప్రజలకు అవగాహన కల్పిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి మాట్లాడుతూ ప్రజల సంక్షేమమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని అన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమానికి ప్రభుత్వం సమాన ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. ప్రతి అర్హ కుటుంబానికి ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు చేరేలా పారదర్శకంగా పనిచేస్తున్నామని పేర్కొన్నారు. రైతుల సంక్షేమం, మహిళల సాధికారత, యువతకు ఉపాధి అవకాశాలు, విద్యార్థులకు మెరుగైన విద్యా సదుపాయాలు, పేద కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించే దిశగా ప్రభుత్వం అనేక కార్యక్రమాలను అమలు చేస్తోందని ఎమ్మెల్యే వివరించారు. గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల అభివృద్ధి, రహదారులు, తాగునీరు, విద్యుత్, పారిశుద్ధ్యం వంటి ప్రాథమిక సదుపాయాల మెరుగుదలకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోందని తెలిపారు. ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని, వాటి పరిష్కారానికి అధికారులతో సమన్వయం చేసుకుంటూ ముందుకు వెళ్తున్నామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించడంతో పాటు, ప్రజల నుంచి వచ్చిన సూచనలు, సమస్యలను తెలుసుకోవడమే ఇంటింటికీ కూటమి ప్రభుత్వం కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని తెలిపారు. అనంతరం వార్డు నాయకులు, మహిళలు, ప్రజలు ఎమ్మెల్యే కందుల నారాయణ రెడ్డిని శాలువా, పూలమాలలతో ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు. ప్రజలతో మమేకమై ప్రతి ఇంటి వద్దకు వెళ్లి ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను వివరించిన ఎమ్మెల్యేను స్థానికులు అభినందించారు. ఈ కార్యక్రమంలో వార్డు నాయకులు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, మహిళలు, యువత, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## కరేడు, అలగాయపాలెం గ్రామాలలో పొలం పిలుస్తుంది కార్యక్రమం






(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, ఆగస్టు 12)
మండలంలోని కరేడు, అలగాయపాలెం గ్రామాలలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి డి విజయకుమార్ మాట్లాడుతూ ప్రతి రైతు ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేయించుకొని ఫార్మర్ కలిగివుండాలని, ఇది ఆధార్ మాదిరిగా కేంద్ర ప్రభుత్వం వారు అందించే ప్రత్యేక డిజిటల్ నెంబర్, ఇది కలిగి ఉన్న వాళ్ళకే పీ కిసాన్, విత్తనాలు, ఎరువులు పంట రుణాలు, పంటల భీమా, ధాన్యం కొనుగోలు, ప్రభుత్వ పథకాలు అందే పరిస్థితి ఉంది కనుక మీ భూమి వివరాలు, ఆధార్ తీసుకొని మీ గ్రామ రైతు సేవాకేంద్రం లో సంప్రదించాలని తెలియజేసారు. ఈ కార్యక్రమంలో విఏఏ, విహెచ్ఏలు కిషోర్, మసూద్, ఏపిసిఎన్ఎఫ్ సిబ్బంది రమేష్, సులోచన, వెంకటరెడ్డి, గ్రామ రైతులు పాల్గొన్నారు.

# 100 అడుగులు జాతీయ జెండాతో ఒంగోలులో బీజేపీ స్వాతంత్ర్య ర్యాలీ





**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఆగస్టు 12)**

80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో భాగంగా భారతీయ జనతా పార్టీ (బీజేపీ) ఆధ్వర్యంలో ఒంగోలు నగరంలో భారీ జాతీయ జెండాతో ర్యాలీ నిర్వహించారు. అద్దంకి బస్టాండ్ నుంచి పీవీఆర్ స్కూల్ వరకు సాగిన ఈ ర్యాలీలో సుమారు 3,000 మంది విద్యార్థులు, విద్యార్థినులు, చిన్నారులు పెద్ద సంఖ్యలో పాల్గొని 100 అడుగులు జాతీయ జెండాలతో దేశభక్తిని చాటుకున్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్యం కోసం లక్షలాది మంది స్వాతంత్ర్య సమరయోధులు తమ ప్రాణాలను త్యాగం చేశారని గుర్తుచేశారు. వారి త్యాగాల ఫలితంగానే నేడు మనం స్వేచ్ఛా వాయువులు పీలుస్తూ స్వాతంత్ర్యాన్ని అనుభవిస్తున్నామని పేర్కొన్నారు. స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకుంటూ వారికి ఘన నివాళులు అర్పించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఎర్రటి ఎండను సైతం లెక్కచేయకుండా వేలాది మంది ర్యాలీలో పాల్గొనడం దేశభక్తికి నిదర్శనమని నాయకులు పేర్కొన్నారు. భారీ సంఖ్యలో విద్యార్థులు పాల్గొనడం శుభసూచకమని తెలిపారు. ఈ కార్యక్రమం లో జిల్లా అధ్యక్షులు శ్రీనివాసరావు, రాష్ట్ర కో కన్వీనర్ శివారెడ్డి, జిల్లా కన్వీనర్ వాసు, కో కన్వీనర్ శ్రీనివాసరావు, సతీష్, రమాదేవి, దామోదర్, డి శివాజీతో పాటు పలువురు సీనియర్ నాయకులు పాల్గొన్నారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసిన నాయకులు, కార్యకర్తలు, విద్యార్థులు, ప్రజలకు నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు.





## జ్ఞాన జ్యోతితో కార్యకర్తల అభ్యాసనా నైపుణ్యాలు పెంపు





**(షణ్ముఖ వెలుగు, చిన్నగంజాం, ఆగస్టు 12)**

జ్ఞాన జ్యోతి శిక్షణ కార్యక్రమంలో నేర్చుకున్న ప్రతి ఒక్క అంశం అంగన్వాడి సెంటర్ లో పిల్లల యొక్క సమగ్ర అభివృద్ధికి తోడ్పడే విధంగా చూడాలని, ట్రైనింగ్ పూర్తయిన తర్వాత ప్రతి సెంటర్లో మార్పు స్పష్టంగా కనిపించాలని ఇంకోల్లు సిడిపిఓ సులోచన తెలిపారు. బుధవారం మండలంలోని కడపకుదురు జడ్పీ హైస్కూల్ నందు జ్ఞాన జ్యోతి శిక్షణ కార్యక్రమంలో భాగంగా రెండో రోజు అంగన్వాడి కార్యకర్తలు, సహాయకులకు ఆర్ఎల్ఎం గురించి దాని యొక్క ఆవశ్యత, పిల్లలకు అది ఏవిధంగా ఉపయోగపడుతుందని తల్లితండ్రులకి అనుకరించి పిల్లలను ఎలా నేర్పించాలో వాటి గురించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డిస్ట్రిక్ట్ కో ఆర్డినేటర్ సుబ్బయ్య మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాల్లోని పిల్లలకు ఆటపాటలతో విద్యను నేర్పే విధానంలో మెళకువలను ఈ శిక్షణ ద్వారా అందిస్తున్నట్లు, దీని ద్వారా కార్యకర్తల అభ్యాసనా నైపుణ్యాలు పెరుగుతాయాని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిడిపిఓ సులోచన, సూపర్వైజర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## స్టైఫండ్ పెంపు, సమస్యల పరిష్కారానికి డిమాండ్

### రెండవ రోజు కొనసాగుతున్న జూనియర్ డాక్టర్‌లు సమ్మె
### సమస్యలు పరిష్కరించకుంటే ఉద్యమం మరింత ఉధృతం చేస్తాం



**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఆగస్టు 12)**

జూనియర్ డాక్టర్లకు స్టైఫండ్ పెంపుతో పాటు పెండింగ్‌లో ఉన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఒంగోలు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి (జీజీహెచ్)లో జూనియర్ డాక్టర్లు చేపట్టిన సమ్మె బుధవారం రెండో రోజుకు చేరుకుంది. ప్రభుత్వం ఇప్పటికీ స్పందించకపోవడంతో జూనియర్ డాక్టర్లు తమ ఆందోళనను కొనసాగిస్తూ నిరసన తెలిపారు. జూనియర్ డాక్టర్ల సంఘం (జుడా) ప్రకాశం జిల్లా అధ్యక్షుడు డాక్టర్ జి భార్గవ సాయి మాట్లాడుతూ స్టైఫండ్ పెంపుపై ప్రభుత్వం ఇచ్చిన హామీని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. పెరుగుతున్న జీవన వ్యయాలకు అనుగుణంగా ప్రస్తుతం అందుతున్న స్టైఫండ్ ఏమాత్రం సరిపోవడం లేదని, రాత్రింబవళ్లు వైద్య సేవలు అందిస్తున్న జూనియర్ డాక్టర్ల సమస్యలను ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడం బాధాకరమన్నారు. సమస్యల పరిష్కారం కోసం పలుమార్లు వినతిపత్రాలు సమర్పించినా ప్రభుత్వం స్పందించలేదని, అందుకే నిరసన కార్యక్రమాలను కొనసాగిస్తున్నామని తెలిపారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా అత్యవసర వైద్య సేవలను యథావిధిగా కొనసాగిస్తూ, సాధారణ వైద్య సేవలను మాత్రమే బహిష్కరిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం చర్చలకు ఆహ్వానించి సమస్యలను పరిష్కరించాలని, లేకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని జుడా నాయకులు హెచ్చరించారు. ఈ నిరసనలో జుడా జిల్లా కార్యదర్శి ఎస్ క్రిస్సికాంత్, ఫైజా పఠాన్, జీషిత, సుప్రియా, తదితర జూనియర్ డాక్టర్లు పాల్గొన్నారు.

## విద్యుత్‌శాఖ అధికారులతో సమీక్ష






**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఆగస్టు 12)**

ఒంగోలులోని విద్యుత్ భవన్లో ఏపీ సీపీడీసీఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ పి పుల్లారెడ్డి బుధవారం ప్రకాశంజిల్లా విద్యుత్‌శాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆదాయ వసూళ్లు, పంపిణీ నష్టాల తగ్గింపు, కేంద్ర, రాష్ట్రాల ముఖ్య పథకాలైన ఆర్డీఎస్-ఎస్, పిఎం సూర్యఘర్, పరివర్తకాల పనితీరు, స్మార్ట్ మీటర్ల గురించి, విద్యుత్‌శాఖ మీద ప్రజల అభిప్రాయం, నిరంతరాయ, నాణ్యమైన విద్యుత్ అందించడం కోసం తీసుకోవలసిన చర్యలు వాటి ప్రణాళికలు పెండింగ్ పనుల పురోగతి తదితర అంశాల పై సమగ్రంగా చర్చించారు. విద్యుత్ బిల్లుల వసూళ్లు, బకాయిల పరిస్థితి పై సమీక్ష నిర్వహించి, బకాయిల వసూళ్ల కోసం ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఆర్‌డీఎస్ఎస్ పనులను వేగవంతం చేయడంతో పాటు, అంతరాయం లేని నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించేందుకు ఫీడర్ పెట్రోలింగ్ నిర్వహించి లోపాలను సకాలంలో గుర్తించి సరిదిద్దాలని సూచించారు. తద్వారా ప్రజల్లో విద్యుత్‌శాఖ పట్ల శాటిస్ఫాక్షన్ లెవెల్స్ పెరుగుతాయని తెలిపారు. మాపింగ్, డీటీర్ మాపింగ్ అన్ని 33కేవీ, 11కేవీ ఫీడర్లు, ట్రాన్స్ఫార్మర్‌కు అనుసంధానమైన సర్వీసుల వివరాలు అన్నియు ఆన్‌లైన్‌లో త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. తదుపరి ఒంగోలు డిస్ట్రిక్ట్ స్టోర్స్, ఎస్‌పిఎం ను తనిఖీ చేసి తగు సూచనలు తెలియజేసారు. ఈ కార్యక్రమంలో ఏపీ సీపీడీసీఎల్ డైరెక్టర్లు మురళీకృష్ణ యాదవ్, వెంకటేశ్వర్లు, విద్యుత్‌శాఖ ఎస్‌ఈ కట్టా వెంకటేశ్వర్లు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు, అసిస్టెంట్ ఇంజనీర్లు, ఇతర విద్యుత్‌శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలకు వాటర్ కూలర్ బహూకరణ రోటరీ క్లబ్ ఆఫ్ మాచర్ల



**(షణ్ముఖ వెలుగు, మాచర్ల టౌన్, ఆగస్టు 12)**

కడ్లకుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో బుధవారం రోటరీ క్లబ్ ఆఫ్ మాచర్ల ఆధ్వర్యంలో వి. సారా స్వరూప సహకారంతో రూ.10,000లు విలువ గల వాటర్ కూలర్‌ను అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ ఆఫ్ మాచర్ల అధ్యక్షులు పఠాన్ నాగూర్ వలి మాట్లాడుతూ విద్యార్థులు తరగతి గదిలో బోధించే పాఠ్యాంశాలతో పాటు, సాంకేతిక పరిజ్ఞానం కూడా పెంచుకోవాలని తెలిపారు. ఉపాధ్యాయులు సామాజిక నిర్దేశకులని, సాధారణ బోధనా అంశాలతో పాటు, నైతిక విలువల పెంపుకు, కృషి చేయాలని హితావు పలికారు. సీనియర్ రొటేరియన్,డాక్టర్ కొండవీటి రామకోటయ్య మాట్లాడుతూ పరిశుద్ధమైనటువంటి నీటిని త్రాగడం ద్వారా, అనేక శారీరక రుగ్మతల నుండి దూరంగా ఉండవచ్చు అని, పరిశుభ్రత విషయంలో పాఠశాలలో ఉపాధ్యాయులు, పిల్లలకు మార్గదర్శకంగా ఉండాలని సూచించారు. ప్రధానోపాధ్యాయులు వెంకటేశ్వరరావు మాట్లాడుతూ పాఠశాలకు మౌలిక వసతుల కల్పనలో రోటరీ క్లబ్ ఆఫ్ మాచర్ల, పి సారాస్వరూప అందించిన సహకారానికి కృతజ్ఞతలు తెలియజేశారు. భవిష్యత్తులో కూడా మా పాఠశాలకు రోటరీ క్లబ్ సేవలు అందిస్తారని ఆశిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో రోటరీ ట్రెజరర్ ఆవుల వెంకట వీరాంజనేయులు, ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

On behalf of PRINTER, PUBLISHER OWNED BY OBULASETTY RADHAKRISHNA DASS AND PRINTED AT HARI PRINTERS AND PUBLICATIONS, FLOT 51, NEAR B.V.SUBBAIAH SCHOOL ROAD, PERNAMITTA, SANTANUTALAPADU (MANDAL), PRAKASAM/ONGOLE (Dt), ANDHRA PRADESH, PIN : 523225. Mobile : 9494177939, RNI : APTEL/2023/89152, e-mail : rkreport9@gmail.com. E-Paper : shanmukhavelugu.com